ప్రతి నిత్యం తాజా సమాచారంతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక



ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

Publisher&Editor: 9391690609,Office :7893003409

aksharamtsnews@gmail.com https//www.facebook.com/aksharamnewspaper/

www.aksharamtelugudaily.com

సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

బుధవారం 19 జూన్ 2024 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 07 సంచిక : 90 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## 21న తెలంగాణ కేబినెట్ భేటీ!



# మేం పాలకులం కాదు.. సేవకులం

**హైదరాబాద్,జూన్ 18 (అక్షరం న్యూస్) :** తాము పాలకులం కాదు సేవకులమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ హైదరాబాద్ లోని మల్లేపల్లిలో అడ్వాన్స్ టెక్నాలజీ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ డిజైన్ ను రేవంత్ రెడ్డి పరిశీలించారు. డిజైన్ గురించి సీఎంకు అధికారులు వివరించారు. అదేవిధంగా పలు సాంకేతిక పరికరాలను కూడా సీఎం పరిశీలించి వాటి వివరాలను తెలుసుకున్నారు.అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ప్రపంచ అవసరాలకు సరితూగేలా శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా




## ఛత్తీస్‌ఘడ్ విద్యుత్ ఒప్పందంతో
# 2,600 కోట్ల నష్టం

### విద్యుత్ శాఖ మాజీ అధికారి రఘు వెల్లడి
### జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు పవర్ పాయింట్ ప్రజంటేషన్



**హైదరాబాద్,జూన్ 18 (అక్షరం న్యూస్) :** ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందాల వల్ల 2,600 కోట్ల రూపాయల నష్టం జరిగిందని విద్యుత్ శాఖ మాజీ అధికారి రఘు తెలిపారు. మంగళవారం జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ఎదుట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినట్టు చెప్పారు. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ కేంద్రాలపై తమ వద్ద ఉన్న సమచారాన్ని కూడా అందించామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌తో తొలుత వెయ్యి మెగావాట్ల సరఫరాకు

## పిఎం కిసాన్ సమ్మాన్
# నిధులు విడుదల

### మీ ఆశలను వమ్ము చేయకుండా పనిచేస్తా
### గంగామాత దత్తతతీసుకోవడంతో మీలో ఒకడినయ్యా
### 20వేల కోట్లు విడుదల చేసిన ప్రధాని మోడీ

**వారణాసి,జూన్ 18 (అక్షరం న్యూస్) :** గంగా మాత తనను దత్తత తీసుకుందని, అందుకే తాను వారణాసివాసుల్లో ఒకరినయ్యానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కాశీ ప్రజలు తనను ఎంపీగా ఎన్నుకోవడమే కాకుండా వరుసగా మూడోసారి ప్రధానిని చేశారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం ప్రజాస్వామ్య దేశాల్లో మాత్రమే సాధ్యమన్నారు. 60 ఏళ్ల క్రితం ఇది జరిగిందని, అప్పటి నుంచి ఏ ప్రభుత్వం కూడా ఇప్పుడు సాధించిన హ్యాట్రిక్ సాధించలేదని చెప్పారు. ఎప్పటిలాగే ప్రజల కలలు, ఆంక్షాలను పండిచేందుకు



# ఎన్డీయే కూటమిలో అసంతృప్తి

### మోదీ శిబిరంలోని నేతలు మాతో టచ్‌లో ఉన్నారు : రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,జూన్ 18 (అక్షరం న్యూస్) :** కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. మెజారిటీ సాధించడంలో విఫలమైన మోదీ ప్రభుత్వంలోని ఎన్డీయే కూటమిలో ప్రస్తుతం అసంతృప్తి నెలకొందన్నారు. కూటమి తన మనుగడ కోసం కష్టపడుతోందని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మోదీ శిబిరంలోని కొందరు నేతలు తమతో టచ్ లో ఉన్నారంటూ బాంబు పేల్చారు.యూకే



## ఆయిల్ పామ్ సాగుకు
# ప్రోత్సాహం

### రూ.133.50 కోట్లు విడుదలకు సమ్మతి
### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి



# వైద్య శాఖలో ప్రక్షాళన మొదలైంది

### ఒకటి రెండు ఏళ్లలో స్థిరమైన మార్పులు
### ప్రతి 35 కిలోమీటరు కి ఒక ట్రామ సెంటర్
### కొత్తగా 75 ట్రమా కేర్ సెంటర్లు ఏర్పాటు
### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

**హైదరాబాద్,జూన్ 18 (అక్షరం న్యూస్) :** వైద్య శాఖలో ప్రక్షాళన మొదలైందని, ఒకటి రెండు ఏళ్లలో స్థిరమైన మార్పులు కనిపిస్తాయన్నారు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ కిట్ లో మార్పులు.. ప్రతి 35 కిలోమీటరు కి ఒక ట్రామ సెంటర్, కొత్తగా 75 ట్రమా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డయగ్నోస్టిక్ సెంటర్లు ప్రభుత్వ ఆస్పత్రులకు లింక్ చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 3 రకాల టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయబోతున్నామని, ప్రైవేటు ఆస్పత్రుల పర్యవేక్షణ ( క్లినికల్ ఎస్టాబ్లిష్ ) అని ఆయన వ్యాఖ్యానించారు.



# సీఎంతో వాక్‌ఫీల్డ్ మార్టిన్ డైరెక్టర్ భేటీ..



# కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలని బీజేపీ తొందర పడుతుంది

### మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



# మేం పాలకులం కాదు.. సేవకులం







యువతను తీర్చిదిద్దేందుకు ఏటీసీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేటు రంగంలోని ఇతర ఉద్యోగాలు అందిపుచ్చుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉంటే ప్రభుత్వ ఉద్యోగాల వైపు మాత్రమే చూడరని పేర్కొన్నారు. నైపుణ్యం లేకుండా కేవలం సర్టిఫికెట్ ఉంటే ప్రయోజనం లేదన్నారు. కాగా,ఐటీఐల రూపు మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్లాన్? చేసింది. ఏటా రాష్ట్రంలోని ఐటీఐల నుంచి 1.5 లక్షల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. అయితే.. ఈ విద్యను మరింత మెరుగుపర్చి, శిక్షణ పొందేవారి సంఖ్య డబుల్? చేసేలా సీఎం రేవంత్?రెడ్డి ఆలోచించారు. అందులో భాగంగా టాటా టెక్నాలజీస్?తో ఒప్పందం కుదుర్చుకున్నారు.

అప్‌గ్రేడ్ చేసేందుకు రెడీ..

ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా యువతను తీర్చిదిద్దేందుకుగానూ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఐటీఐలను ఏటీసీలు (అడ్వాన్స్? టెక్నాలజీ సెంటర్స్?)గా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్?తో పదేండ్లకుగానూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు రూ.2,324 కోట్ల నిధులను కేటాయించింది.

65 ఐటీఐలను ఏటీసీలు (అడ్వాన్స్? టెక్నాలజీ సెంటర్స్?)గా అప్‌గ్రేడ్ చేస్తారు. ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఏటీసీల్లో అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు చేస్తారు. శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టీటీఎల్ (టాటా టెక్నాలజీస్? లిమిటెడ్?) నియమించనుంది.ఏటీసీల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల లాంగ్ టర్మ్ కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల షార్ట్ టర్మ్ కోర్సుల్లో శిక్షణ అందిస్తారు. పదేండ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందారు. ఈ ఏటీసీలతో రానున్న పదేండ్లలో 4 లక్షల మంది శిక్షణ అందిచనున్నారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చే ప్రాజెక్టు మొత్తం వ్యయం ?2,324.21 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా ?307.96 కోట్లు (13.26 శాతం) కాగా టీటీఎల్ వాటా ?2016.25 కోట్లు (86.74 శాతం) ఏటీసీలు కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి.అలాగే ఈ ఏటీసీలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు టెక్నాలజీ హబ్‌గా పని చేస్తాయి. ఏటీసీల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టీటీఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఏటీసీలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయి.

## పిఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల

తాను రేయింబవళ్లు పనిచేస్తానని చెప్పారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడోసారి వారణాసి ఎంపీగా మోదీ గెలిచిన తర్వాత తన నియోజకవర్గంలో మంగళవారంనాడు తొలిసారి పర్యటించారు. పీఎం-కిసాన్ పథకం కింద 17వ విడతగా రూ.20,000 కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, వికసత్ భారత్‌కు రైతులు, యువత, మహిళా శక్తి, పేదలు నాలుగు కీలక స్తంభాలని, తాను ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతులు, పేదలకు సంబంధించిన అంశంపైనే తొలి నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలను ప్రధాని ప్రశంసిస్తూ, 60 ఏళ్లలో ఒక ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలో రావడం ఇదే మొదటిసారని చెప్పారు. ఎన్నికల్లో 31 కోట్ల మంది మహిళా ఓటర్లు పాల్గొన్నారు, ప్రపంచం లోనే అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్న రికార్డు ఇదని చెప్పారు. ఈ సంఖ్య దాదాపు అమెరికా జనాభాతో సమానమని అన్నారు. భారత ప్రజాజ్వామ్యం పటిష్టత యావత్ ప్రపంచాన్ని ఆకర్షిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య పండుగను విజయవంతం చేసిన వారణాసి ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆసాధరణ తీర్పునిచ్చారని కొనియాడారు. ప్రపంచంలోనే భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబడేందుకు వ్యవసాయ వ్యవస్థ పాత్ర చాలా కీలకమని మోదీ అన్నారు. సదుద్దేశం, పట్టుదల, రైతుల సంక్షేమానికి పాటుపడటం ద్వారా ఇది సుసాధ్యమని చెప్పారు. గ్లోబల్ మార్కెట్‌ను కూడా దృష్టిలో ఉంచుకోవాలని, వ్యవసాయ ఎగుమతుల్లో ఎదురులేని స్థాయికి చేరుకోవాలని అన్నారు. ప్యాకేజీ ఫుడ్ గ్లోబల్ మార్కెట్‌లో ఇండియాను తిరుగులేని స్థాయికి తీసుకువెళ్లాలని, ప్రపంచంలో ప్రతి డైనింగ్ టేబుల్ వద్దకు మన భారతీయ ఫుడ్ ప్రొడక్ట్‌ను తీసుకువెళ్లాలన్నదే తన కల అని చెప్పారు. రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీఎం-కిసాన్ సమ్మాన్‌నిధి' 17వ విడత నిధులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారణాసిలో మంగళవారం నిర్వహించిన 'పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో విడుదల చేశారు. దీంతో దాదాపు 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2వేలు చొప్పున రూ.20 వేల కోట్లు జమ కానున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో విజయం, ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారణాసిలో మోదీ పర్యటించడం ఇదే తొలిసారి. నరేంద్ర మోదీ ఈనెల 9వ తేదీన వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజు పీఎంవో

కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన.. 'పీఎం కిసాన్' 17వ వాయిదా చెల్లింపు దస్త్రంపైనే తొలి సంతకం చేశారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి ఈ పథకం అమలు చేస్తోంది. దీనికింద అర్హులైన రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.2వేలు చొప్పున మొత్తం రూ.6 వేలు పెట్టుబడి సాయంగా ఇస్తోంది.

## ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

**హైదరాబాద్,జూన్ 18 (అక్షరం న్యూస్) :**

రాష్ట్రంలో పెరిగిన పంట మార్పిడి ఆవశ్యకత దృష్ట్యా, తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు ,వివిధ ఉద్యాన పంటలలో సూక్ష్మ సేద్యం కొరకు రాయితీలు ఇస్తూ పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. 2023-24 సం.కి గాను 59,261 ఎకరాలు కొత్తగా ఆయిల్ పామ్ సాగులోకి తీసుకురావడం జరిగింది. 2023-24 సం.కి గాను ఆయిల్ పామ్ సాగు పథకం కింద, కేంద్ర ప్రభుత్వం రూ.80.10 కోట్లను విడుదల చేయడం జరిగింది. దీనికి రూ.53.40 కోట్ల రాష్ట్ర వాటా కలుపుకుని మొత్తం రూ.133.50 కోట్లు విడుదల చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగింది. ఈ మొత్తంలో 2023-24 సం.లో కేవలం రూ.32.72 కోట్లు మాత్రమే విడుదల చేయగా, వివిధ కారణాల చేత రూ.100.76 కోట్లు పెండింగ్ లో పెట్టడం జరిగింది. దీని వలన ఉద్యాన శాఖ, రైతులకు మరియు ఆయిల్ పామ్/ డ్రిప్ కంపెనీలకు, సకాలంలో బకాయిలు విడుదల చేయడం వీలుపడలేదు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రి చొరవతో, ముఖ్యమంత్రి రేవంత్ దృష్టిలోకి ఆయిల్ పామ్ రైతుల మరియు కంపెనీల ఇబ్బందులను తీసుకురాగ, పెండింగ్ లో వున్న రూ.100.76 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.

ఈ మొత్తాన్ని 2-3 రోజులలో ఆయిల్ పామ్ తోటల నిర్వహణ, అంతర పంటల సాగుకు సంబందించిన రాయితీలను, రైతుల ఖాతాలలో జమ చేయుటకు ఉద్యానశాఖ చర్యలు తీసుకోవడం జరుగుతున్నది.ఇదే విధంగా, 2022-23 సం. నుండి విడుదల కావలసివున్న సూక్ష్మ సేద్యానికి సంబందించి, రూ.55.36 కోట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం జరిగింది. ఈ మొత్తాన్ని అయిల్ పామ్, ఇతర పంటలలో డ్రిప్ పరికరాలను రైతు పంట పొలంలో అమర్చిన సూక్ష్మ సేద్య కంపనీలకు పెండింగ్ లో ఊన్న బకాయిలుగాను విడుదల చేయడం జరిగింది. బకాయిలు విడుదలైనందువలన 2024-25 సంవత్సరానికి గాను నిర్ధేశిరచిన లక్ష్యాన్ని చేరుకొనేవిధంగా రైతులను ఆయిల్ పామ్ చేపట్టుటకు ప్రొత్సహించవలసిందిగా ఉద్యాన అధికారులను మంత్రి ఆదేశించడం జరిగింది.

## 21న తెలంగాణ కేబినెట్ భేటీ!

**హైదరాబాద్,జూన్ 18 (అక్షరం న్యూస్) :**

ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం తెలంగాణ మంత్రిమండలి భారీ అజెండాతో సమావేశం కాబోతోంది. ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాల సమాచారం మేరకు ఈ నెల 21న ఉదయం 11 గంటలకు సచివాలయం వేదికగా కేబినెట్ భేటీ జరగనుంది.పరిపలనకు సంబంధించిన అనేక అంశాలు, సంక్షేమ రంగానికి చెందిన కీలక నిర్ణయాలు, ఉద్యోగులు, ఇరు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పుల పంపకాలు తదితర అంశాలు అజెండాలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అత్యంత ప్రాధాన్యత గల, రాజకీయ సవాళ్ళతో ముడిపెట్టుకుని ఉన్న అంశం రైతు రుణమాఫీ, నిధుల సమీకరణపై సుదీర్ఘంగా చర్చించి కీలక నిర్ణయం తీసుకోనున్నారు.లబ్ధిదారుల ఎంపిక విషయంలో అనుసరించాల్సిన విధానాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, ఇదివరకున్న మార్గదర్శకాలు తదితర అంశాలపై సీఎం రేవంత్ తమ మంత్రివర్గ సహచరుల అభిప్రాయం తీసుకోనున్నారు. అలాగే పదేళ్ల గడువు ముగిసిన నేపథ్యంలో విభజన సమస్యల పరిష్కారం దిశగా మంత్రిమండలి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి.చట్టంలోని 9వ, 10వ షెడ్యూల్ సంస్థల విభజన అడ్డంకులకు పరిష్కార మార్గం చూపనున్నారు. విద్యుత్ ఒప్పందాలు, కాళేశ్వరం అక్రమాలపై చర్చించనున్నారు. ఈ రెండు అంశాలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ కమిషన్ల విచారణ, ఇప్పటికే ఇచ్చిన ప్రాథమిక నివేదిక అంశాలపై కూడా చర్చ జరగనుంది.ప్రభుత్వోద్యోగుల పీఆర్సీ, డీఏ, ఇతర సమస్యలపై కూడా చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. తాజాగా సీఎం ప్రకటించిన నూతన విద్యా విధానంపై కేబినెట్ చర్చించనుంది. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలపై ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదికపై చర్చించి, మరమ్మతులు, తదుపరి కార్యాచరణలపై నిర్ణయం తీసుకోనున్నట్లుగా సమాచారం.

రుణమాఫీ నిధుల సమీకరణ ప్రధానం..

రుణమాఫీకి అవసరమైన నిధుల సమీకరణ, లబ్ధిదారుల ఎంపిక విధానం, రుణమాఫీకి సంబంధించి కటాఫ్ తేదీ నిర్ణయం, మహారాష్ట్ర పర్యటనలో అధ్యయనం చేసిన అంశాలపై విశ్లేషణ తదితర అంశాలపై కేబినెట్ అజెండాలో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా పర్యటనల అజెండాపై కూడా మంత్రిమండలిలో చర్చించి తేదీలను ఖరారు చేసే అవకాశం ఉంది.ౖతు రుణమాఫీపై కూడా మంత్రిమండలి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. ఇటీవల ఎన్నికల సందర్భంలో ప్రజలకు హామీ ఇచ్చినందున, ఆగస్టు 15వ తేదీ నాటికి రుణమాఫీ చేసి తీరాల్సిందేనని సీఎం, మంత్రులు పదేపదే చెబుతున్న నేపథ్యంలో దానికోసం నిధుల సమీకరణ, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు వంటి అంశాలపై మంత్రివర్గం చర్చించనుంది.

సుమారు 42 లక్షల మంది రైతులకు రుణమాఫీకి సుమారు రూ.32,000 కోట్ల నిధులను ఎలా సమకూర్చుకోవాలన్న అంశంతో పాటు దానికి సంబంధించి విధి, విధానాలపై అధికారులకు మంత్రివర్గం దిశానిర్దేశం చేసే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. రాష్ట్ర ఆదాయం పెంచుకునేందుకు వనరుల సమీకరణ, ప్రత్యామ్నాయ, నూతన మార్గాల అన్వేషణపై కేబినెట్ చర్చించనుంది.

రాష్ట్రాల మధ్య అపరిష్కృత అంశాలపై కీలక నిర్ణయం..

రాష్ట్ర పునర్విభజన జరిగి పదేళ్లు పూర్తి అవుతున్న తరుణంలో పునర్విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై కేబినేట్‌లో చర్చించనున్నట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే వివిధ శాఖలు అధికారులు పలు అంశాలపై ని వేదికలు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా నేడు జరిగే కేబినేట్‌లో ఎపి, తెలంగాణ విభజన వివాదాలపై మంత్రివర్గం చర్చించనుంది. రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ధాన్యం పెంపు మార్గాలపై సమావేశంలో చర్చించనుంది.

పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10లోని వందకుపైగా ఆస్తుల విభజన, హైదరాబాద్‌లో ఎపికి కేటాయించిన భవనాల స్వాధీనం, బకాయిల వివాదాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. వీటికి సంబంధించిన వివరాలతో నివేదిక తయారు చేస్తున్న ఆర్థిక శాఖ కేబినెట్ ముందు పెట్టనుంది. ఎపితో చర్చించేందుకు కమిటీ ఏర్పాటు చేసి కొన్ని అంశాలు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపులపై..

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ, రైతులకు చెల్లింపులు, ఖరీఫ్ పంటల సాగు, పెట్టుబడి నిధుల అంశంపై కూడా కేబినెట్ సమీక్షించనున్నట్టుగా తెలుస్తోంది. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనుగోలు, ప్రాసెసింగ్, నష్టం తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం. రానున్న ఖరీఫ్ పంటల ప్రణాళికపై కూడా కేబినెట్‌లో చర్చ జరుగనున్నట్టుగా తెలిసింది. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులకు అవగాహన కార్యక్రమాలపై చర్చించే అవకాశం ఉంది.

## వైద్య శాఖలో ప్రక్షాళన మొదలైంది

ఫార్మా మెడికల్ కోసం (డ్రగ్స్ నియంత్రణ ) ఫుడ్ క్వాలిటీ కోసమని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రాంతాల వారీగా సర్వే చేయకుండా అవసరం లేకుండా ఇచ్చారని, మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లు కూడా దొరకని పరిస్థితి అని ఆయన అన్నారు. మెడికల్ ప్రొఫెషన్ స్లో గా పెరగాలన్నారు. కేసీఆరే డాక్టర్ అయ్యాడు%ొ% కేసీఆరే ఇంజనీర్ అయ్యాడని ఆయన సెటైర్లు వేశారు. కరోనా కు పారాసిటామాల్ అన్నారు.. కాళేశ్వరం ఆయన్నే డిజైన్ చేశారన్నారు. హైదరాబాద్ లో 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల కోసం 9 వేల కోట్ల రూపాయలు లోన్ రూపంలో తీసేసుకున్నారని, 21 అంతస్తుల నుంచి 14 అంతస్తులకు తగ్గించామన్నారు దామోదర రాజనర్సింహ. వైద్య రంగంలో రెగ్యులేటరీ పవర్స్ అమలు చేద్దామన్నారు దామోదర రాజనర్సింహ. గత ప్రభుత్వ తీరుపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శలు తెలిపారు. సిద్దిపేట ఆస్పత్రిపై దృష్టి పెట్టి.. ఉస్మానియా ఆస్పత్రిని పట్టించుకోలేదని, పదేళ్లు పాలించి కనీసం ఉస్మానియా ఆస్పత్రిని కొత్తగా కట్టలేదన్నారు. సిటికి పక్కనే ఉన్న మహేశ్వరంలో మెడికల్ కాలేజీ ఎందుకు ఇచ్చారో తెలియదన్నారు దామోదర రాజనర్సింహ. ఇంజనీరింగ్ కాలేజీల మాదిరిగా మెడికల్ కాలేజీలు కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు.౹౹

## ఎన్డీయే కూటమిలో అసంతృప్తి

ఫైనాన్షియల్ టైమ్స్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని మోదీ నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఆ శిబిరంలోని కొందరు నేతలు మాతో టచ్‌లో ఉన్నారు. ప్రస్తుతం కూటమి మనుగడ కోసం కష్టపడుతోంది. అది బలహీనంగా ఉండటంతో ఏ చిన్న సమస్య అయినా ప్రభుత్వాన్ని కూలదోయొచ్చు' అని వ్యాఖ్యానించారు.ఇదిలా ఉండగా.. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ సారి ఇతరులపై ఆధారపడిన విషయం తెలిసిందే. 2014 తర్వాత తొలిసారి బీజేపీ మేజిక్ ఫిగర్ 272 సీట్లను దాటలేక పోయింది. ఇటీవలే వెలువడిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి సొంతంగా 240 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో మిత్రపక్షాలతో కలిసి ఎన్డీఏ 292 స్థానాలను కైవసం చేసుకుంది. ఇదే సమయంలో ఇండియా కూటమి పార్టీలకు 230కి పైగా సీట్లు రావడం మోదీ దూకుడుకు అడ్డుకట్ట పడినట్లైంది. ఇక చేసేదేమీ లేక కూటమి నేతల మద్దతుతోనే మోదీ ముచ్చటగా మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రాహుల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## ఛత్తీస్‌ఘడ్ విద్యుత్ ఒప్పందంతో 2,600 కోట్ల నష్టం

ఒప్పందం జరిగితే అది సప్లయ్ కాలేదని, తర్వాత తెలుసుకొని మరో వెయ్యి మెగావాట్లకు ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. తరువాత తెలుసుకొని రద్దు చేసుకోవాలని ప్రయత్నిస్తే కుదరలేదన్నారు. చత్తస్ గఢ్ ఒప్పందం రెగ్యులెటరీ కమిషన్ ఒప్పదం పొందలేదని చెప్పారు. ఇరు రాష్ట్రాల డిస్కంలు మాత్రమే ఎంవోయూ చేసుకున్నాయని చెప్పారు. బీహెచ్ఈఎల్ కాంపిటేటివ్ బిడ్డింగ్ లో 2013-2014 88శాతం ఉంటే తర్వాత జీరోకు పడిపోయిందని చెప్పారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన యాదాద్రి ప్లాంట్ తొమ్మిదేండ్లయినా పూర్తి కాలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై బీహెచ్ఈఎల్ సబ్ క్రిటికల్ టెక్నాలజీని రుద్దిందని చెప్పారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ కోసం వాడిన యంత్రాలు సరైనవి కావదని అన్నారు. గోదావరిలో ఫ్లడ్ ఎక్కువైతే పవర్ ఎ÷-లాంట్ పై ప్రభావం పడుతుందని చెప్పారు. సాంకేతిక పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా భద్రాద్రి పవర్ ఎ÷-లాంట్ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. యాదాద్రి పవర్ ఎ÷-లాంట్ వల్ల రవాణా చార్జీల భారం పడుతుందని చెప్పారు. ఈ విషయాలన్నీ కమిషన్ కు వివరించినట్టు చెప్పారు.

## సీఎంతో వాక్‌ఫీల్డ్ మార్టిన్ డైరెక్టర్ భేటీ..

**హైదరాబాద్,జూన్ 18 (అక్షరం న్యూస్) :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీతో లాక్‌హీడ్ మార్టిన్ ఇండియా డైరెక్టర్ మైఖేల్ ఫెర్నాండెజ్, కుష్ మన్ అండ్ వేక్ ఫీల్డ్ సంస్థ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ భౌ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ గ్లోబల్ సిటీ వృద్ధి చెందుతున్న తీరు, వివిధ రంగాలు విస్తరిస్తున్నతీరుపై ఈ భేటీలో చర్చించారు.గ్రేటర్ హైదరాబాద్ సిటీ దేశంలోనే శరవేగంగా వృద్ధి చెందుతోందని కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ కంపెనీ ప్రతినిధి బృందం ఈ సందర్భంగా తమ అధ్యయన వివరాలను పంచుకుంది. గడిచిన ఆరు నెలల్లో రియల్టీతో పాటు లీజింగ్, ఆఫీస్ స్పేస్, నిర్మాణ రంగం, రెసిడెన్షియల్ స్పేస్ లోనూ హైదరాబాద్ సిటీ గణనీయమైన వృద్ధి నమోదు చేసిందని అభిప్రాయపడింది.

దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు సంబంధించి ప్రతి ఆరు నెలలకోసారి వెల్లడించే తమ నివేదిక జులై నెలాఖరులో వెలువడుతుందని తెలిపింది. తమ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు రూట్ విస్తరణతో హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారవుతుందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.తాము దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, హైదరాబాద్‌ను ప్రపంచంలో పేరొందిన నగరాల సరసన నిలబెట్టాలనేది తమ సంకల్పమని అన్నారు. తెలంగాణ నుంచి అమెరికాలో ఉంటున్న వారి సంఖ్య, అక్కడి వెళ్లి వచ్చే వారి సంఖ్య పెరిగిపోయిందని, అందుకే న్యూయార్క్‌తో పోల్చుకునేలా హైదరాబాద్ ను తీర్చిదిద్దాల్సి ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

## కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలని బీజేపీ తొందర పడుతుంది

**హైదరాబాద్,జూన్ 18 (అక్షరం న్యూస్) :**

గత ప్రభుత్వంపై నిందలు వేయడానికి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై బురదజల్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం స్వార్థ రాజకీయాలతో విచారణ కమీషన్లు వేస్తోందని మాజీ మంత్రి ఎమ్మెల్యే జి.జగదీష్ రెడ్డి అన్నారు. నేడు (మంగళవారం) తెలంగాణ భవన్‌లో జగదీష్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ొ% నాలుగు అంశాల్లో ఎక్కడా చిన్న తప్పు లేదని, ఒక్క రూపాయి కూడా నష్టం జరగలేదని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్‌తో మీడియా సమావేశం పెట్టించి గతంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు మాట్లాడిన మాటలు చెప్పించారని అన్నారు కేంద్రమంత్రి బండి సంజయ్ తెలివి తక్కువతనం, మూర?త్వంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలని బీజేపీకు తొందరగా ఉన్నట్లుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ వేరు కాదని%ొ% సీఎం రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కలిసి పని చేస్తున్నారని ఐదేళ్లుగా చెబుతున్నామని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.

కమిషన్‌కు ముందస్తు అభిప్రాయాలు ఉండొద్దు..

"ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపే ప్రయత్నం చేశారు. కేసీఆర్ తన లేఖలో అన్ని అంశాలను స్పష్టంగా వివరించారు, ప్రజలకు అన్ని విషయాలు స్పష్టంగా అర్థమయ్యాయి. కమిషన్‌కు ఎలాంటి ముందస్తు అభిప్రాయాలు ఉండరాదు. దురదృష్టవశాత్తూ కమిషన్ తన ఉద్దేశాన్ని ముందే బయట పెట్టింది. వాస్తవానికి జస్టిస్ నరసింహారెడ్డి విచారణకు అంగీకరించి ఉండాల్సింది కాదు. కేసీఆర్ విషయంలో ఏమీ తేల్చలేమని చెప్పి%ొ% రాష్ట్ర ప్రభుత్వం మీడియాకు లీకులు ఇచ్చింది. ఛత్తీస్‌ఘడ్ ఒప్పందంతో రూ. 6000 కోట్ల నష్టం కాదు.. అంతకు మించి లాభం జరిగింది. లీకులను సమర్థించేలా కొందరితో ఈ రోజు మాట్లాడించారు. 17 వేల మిలియన్ యూనిట్లు తీసుకొని ఛత్తీస్‌ఘడ్‌కు రూ.7000 కోట్లు చెల్లిస్తే రూ.6000 కోట్ల దుర్వినియోగం ఎలా అవుతుంది?. ఛత్తీస్‌ఘడ్‌కు సరిపడా విద్యుత్ ఇవ్వకపోవడంతో ఎక్కువ ధరకు కొన్నారు. నష్టం జరిగిందని ఇప్పుడు అంటున్నారు. మరి ఛత్తీస్‌గడ్ ఒప్పందం లేకపోతే 17 వేల మిలియన్ యూనిట్లకు 17 వేల కోట్లు కట్టాల్సి వచ్చేది" అని జగదీష్ రెడ్డి తెలిపారు.

సమైక్య రాష్ట్రంలో కలపడానికి కుట్ర

'ఉత్తర భారతం నుంచి కరెంట్ తీసుకోకుండా కేసీఆర్ ఫెయిల్ అయితే మళ్లీ సమైక్య రాష్ట్రంలో కలపాలన్నది వీరు కుట్ర. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలంటే తెలంగాణ లేకుండా చేయాలి. తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు, పదవుల్లో ప్రతి అక్షరంలో కేసీఆర్ పేరు ఉంది. కేసీఆర్‌కు మసి పూయాలన్న చిల్లర ప్రయత్నం చేస్తున్నారు. దమ్ముంటే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఎందుకు మీడియా సమావేశం పెట్టి చెప్పలేదు?. దొంగలుగా చీకట్లో ముసుగులు వేసుకొని ఎందుకు వ్యవహరిస్తున్నారు. రూ. 6000 కోట్ల నష్టం అన్న కథనాల్లో ప్రతి అక్షరం అబద్దమే. అవినీతి జరిగితే రమణ్‌సింగ్, కాంగ్రెస్ సీఎంలకు ఇచ్చారా? నల్గొండ జిల్లాలో విద్యుత్ కేంద్రం ఎందుకు పెట్టారని ఎవరైనా ప్రశ్నిస్తే ఖబర్దార్. నల్గొండ జిల్లా తెలంగాణలో లేదా ? కోదండరాంకి నల్గొండ కనిపించడం లేదా? నల్గొండ జిల్లా దద్దమ్మ నేతలు నాటి లాగే ఇప్పుడు కూడా నోరెత్తకుండా వ్యవహరిస్తున్నారు, ప్రజలు అన్నీ గమనిస్తున్నారు" అని జగదీష్ రెడ్డి మండిపడ్డారు.

# బయ్యారం మండలంలో ప్రేమజంట ఆత్మహత్యయత్నం...

## ఒకరు మృతి.. ప్రాణాపాయస్థితిలో మరొకరు...

మహబూబాబాద్ /గార్ల /జూన్ 18/అక్షరం న్యూస్...

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డ గ్రామానికి చెందిన కొటెం లక్ష్మీనారాయణ, నీలమ్మ దంపతుల కుమార్తె రవళి(21)కి మూడేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వ్యక్తితో వివాహం కాగా.. భర్తతో మనస్పర్థల కారణంగా కొంతకాలంగా రవళి పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో కోటగడ్డకు చెందిన 23ఏళ్ల మెండు రవీందర్‌తో రవళికి పరిచయం ఏర్పడి అదికాస్తా ప్రేమకు దారితీసింది. కొన్నాళ్ల క్రితం రవీందర్ తల్లిదండ్రులు యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి సమీపంలోని ఓ గ్రామానికి వలస వెళ్లడంతో అతను అక్కడే ఉంటున్నాడు.
అప్పుడప్పుడు స్వగ్రామైన కోటగడ్డకు రాకపోకలు సాగిస్తున్నాడు. కాగా, సుమారు మూడు నెలల క్రితం రవీందర్, రవళి కనిపించకుండా పోయారు. ఆ సమయంలోనే వారు వివాహం చేసుకున్నారనే వార్తలు వచ్చాయి. అయితే తమ కూతురు కనిపించడంలేదని రవళి తల్లిదండ్రులు, తమ కుమారుడు కనిపించడంలేదని రవీందర్ కుటుంబ సభ్యులు రాయగిరి పోలీసస్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. దీంతో అదృశ్యం కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణచేపట్టి రవీందర్‌ను, రవళిని తీసుకొచ్చి వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.
మూడు రోజుల క్రితం రవీందర్ స్వగ్రామానికి రాగా,ఆదివారం రాత్రి రవళి రహస్యంగా అతనింటికి వెళ్లింది. మేడపై నిద్రించిన వాళ్లిద్దరూ తెల్లవారుజామున ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరేసుకున్నారు. ఉరి బిగుసుకొని రవళి అక్కడికక్కడే మృతి చెందగా.. ఉరి బిగుసుకోకపోవడంతో బతికిన రవీందర్ గొంతుకోసుకున్నాడు. గడియపెట్టి ఉండటంతో అనుమానం వచ్చిన రవీందర్ కుటుంబసభ్యులు తలుపులు పగలగొట్టి చూడగా.. ఉరివేసుకొన్న రవళి అప్పటికే మృతి చెందగా..



గొంతుకోసుకున్న రవీందర్ రక్తపుమడుగులతో ప్రాణాపాయ స్థితిలో ఉండటాన్ని చూసి తొలుత జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు.ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. శవపరీక్ష అనంతరం పోలీసులు రవళి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా.. అంత్యక్రియలు నిర్వహించారు.

# డిఎం.హెచ్.ఓ, డిసి.హెచ్.ఎస్‌లపై చర్యలు తీసుకోండి

**– ప్రభుత్వ పెద్దల అండదండలతో భాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు**
**–బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి: యెర్రా కామేష్**

భద్రాద్రి జిల్లా/ పాల్వంచ/ జూన్.18/ అక్షరం న్యూస్ :
నిబంధనలకు విరుద్ధంగా అక్రమ పద్దతిలో భాధ్యతలు చేపట్టి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్ఓ)జెవిఎల్ శిరీష, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డి.సి.హెచ్.ఎస్) గూగులోతు రవిబాబులను భాద్యతల నుండి తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యెర్రా కామేష్ మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కు పిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎయిడ్స్ మరియు లెప్రసి అధికారిగా ఖమ్మంలో విధులు నిర్వహిస్తూ డిప్యూటేషన్ పద్ధతిలో గత ప్రభుత్వ పెద్దల అండదండలతో వర్క్ ఆర్డర్ పై భాద్యతలు నిర్వహిస్తు, వైద్య శాఖలో డిప్యూటేషన్ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసినా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడే విధులు నిర్వహిస్తూ అశ్వారావుపేట పి హెచ్ సీ లో విధులు నిర్వహిస్తున్న టీ.మోహన్ ను ఎటువంటి అర్హత లేకున్నప్పటికీ జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో కీలకమైన పోస్ట్ అయినటువంటి పరిపాలన అధికారిగా నియమించుకొని అతని ద్వారా అక్రమ డిప్యూటేషన్లు చేస్తూ అక్రమ వసూళ్ళకు పాల్పడుతుందని ఆరోపించారు. అదేవిధంగా డిసీ.హెచ్.ఎస్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న రవిబాబు, డిఎం.హెచ్.ఓ శిరీష లు భాధ్యతలు చేపట్టిన నాటి నుండి టెండర్ ప్రక్రియ లేకుండా మంజూరు చేసిన కాంట్రాక్ట్ పనులు, నిభందలకు విరుద్ధంగా చేపట్టిన నియామకాలు, డిప్యూటేషన్లు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు



చేసిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సాయి, శివ, మురళి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం షాపుగా మారిన జిల్లా రవాణా శాఖ కార్యాలయం...

**అధికారులు చీల్ అయ్యేందుకు బీరు బాటిల్ తో దర్శనమిచ్చిన వైనం...**
**అధికారుల పర్యవేక్షణ లోపం, ఇష్టారాజ్యాంగ వ్యవహారిస్తున్న ప్రాంతీయ అధికారి..**
**రవాణా శాఖలో బీరు బాటిల్ తో దర్శనమిచ్చిన అధికారిపై చర్యలకు డిమాండ్ చేస్తున్న ప్రజలు...**






మహబూబాబాద్ /గార్ల /జూన్ 18/అక్షరం న్యూస్...
మహబూబాబాద్ రవాణా శాఖలో ఉన్నతధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రాంతీయ అధికారులకు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది.ఆన్ డ్యూటీ లోనే యథేచ్ఛగా మద్యం సేవిస్తున్న రవాణా శాఖ ఉద్యోగులు, ఇది చూసిన ప్రజలు ఖండిస్తున్నారు.నిరంతరం ప్రజలతో రద్దీగా ఉండే కార్యాలయంలో యథేచ్ఛగామద్యం సేవిస్తున్న వైనం, చోద్యం చూస్తున్న అధికార గణం.బీర్ బాటిళ్లు పక్కనే పెట్టుకొని విధుల నిర్వహణ,తమను ఎవరు ఏమి చేయాలేరని ధీమాతో మద్యం సేవించి విధులు నిర్వహణ.ఇటీవల కాలంలోనే రవాణా శాఖ కార్యక్రమంలో ఏసిబి దాడులు అయిన మారని అధికారుల తీరు.షోషల్ మీడియా లో వైరల్ అవుతున్న వీడియో. సంబంధిత అధికారిపై చర్యలకు డిమాండ్ చేస్తున్న సామాన్య ప్రజానీకం.

## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూన్ 18:
రఘునాథపల్లి విద్యుత్తు సబ్-స్టేషన్ లో ఈ నెల 19(బుధవారం)న అత్యవసర మరమ్మతు పనులు ఉన్నందున ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఎన్పిడిసిఎల్ జనగామ డివిజనల్ ఇంజనీర్ యం.లక్ష్మీనారయణ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రఘునా థపల్లి, కంచనపల్లి, గబ్బెట, కోమల్ల, నిడిగొండ, ఆశ్వరావుపల్లి, కుందారం, వడ్డిచర్ల సబ్-స్టేషన్లకు సంబందించిన ప్రాంతాలలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని, రైతులు, విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని డిఈఈ ల క్ష్మీనారయణ రెడ్డి కోరారు.

## చిన్నారి పై హత్యచారం చేసిన దుండగున్ని కఠినంగా శిక్షించాలి

**–తాజా మాజీ సర్పంచ్,మాజీ ఎంపీటీసీ ప్రతిమ**



రామగిరి (పెద్దపెల్లి జిల్లా) జూన్ 18 అక్షరం న్యూస్:
పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో ఆరెండ్ల బాలికను కిడ్నప్ చేసి తీసుకెళ్లి హత్యచారం చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని రామగిరి మండలం రత్నాపూర్ తాజా మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ పల్లె ప్రతిమ పీవీరావు డిమాండ్ చేశారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంకు చెందిన ఎలకరి మహేష్, సారక్క అనే దంపతులకు పుట్టిన కూతురు సహస్ర(6సంవత్సరాల చిన్నారి)ని కాట్నపల్లి రైస్ మిల్లు లో పని చేస్తున్న బలరాం అనే వ్యక్తి కిడ్నప్ చేసి చెట్ల పొదలోకి తీసుకెళ్లి హత్య చేశాడు. ఇలాంటి క్రూర మానవ మృగాని వెంటనే పోలీస్ లు అదుపులోకి తీసుకొని కఠినంగా శిక్షించాలని అన్నారు. హత్య కు గురి అయినా చిన్నారి కుటుంబంను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబం పూర్తి బాధ్యత రైస్ మిల్లు ఓనర్ తీసుకొని ఆ కుటుంబంను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితునికి శిక్ష వేయించాలని ఆమె డిమాండ్ చేశారు.

## విద్యార్థుల కోసం ఆర్టిసి ప్రత్యేక బస్సు సర్వీసులు

హనుమకొండ/భీమదేవరపల్లి/జూన్18(అక్షరం న్యూస్):
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో నేటి నుండి టిజి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు ప్రారంభం కానున్నాయి.రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో బుధవారం హనుమకొండ ఆర్టిసి రీజనల్ మేనేజర్ శ్రీలత బస్సు సర్వీసులను కేటాయించారు. విద్యార్థుల కోసం ఉదయం కన్నారం నుండి బస్సు ప్రారంభమై కట్కూరు, మల్లారం, రసూల్ పల్లి, కొత్తకొండ, ముస్తాఫాపూర్, గట్లనర్సింగాపూర్ మీదుగా ములుకనూరు లోని మోడల్ స్కూల్ కు బస్సు చేరుకుంటుంది. హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం ఉదయం 7గంటలకు ములుకనూరు నుండి హుస్నాబాద్, సిద్ధిపేట మీదుగా వెళ్లేందుకు బస్సు అందుబాటులో ఉంటుంది. హనుమకొండలో అక్కన్నపేట బస్సు రాత్రి 8:30 గంటలకు బయలుదేరుతుంది. హనుమకొండ లోకల్ బస్సు కాజీపేట నుండి బయలుదేరి వేలేరు, కొత్తకొండ, ములుకనూరుకు ఉదయం 9గంటలకు వచ్చి తిరుగు ప్రయాణమవుతుంది. బస్సు సర్వీసులు పెంచినందుకుగాను మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం రీజనల్ మేనేజర్ శ్రీలతను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు ఉసకోయిల ప్రకాష్, సీనియర్ నాయకులు కొలుగూరి రాజు, వైస్ ఎంపిపి మాడుగుల ఏగ్రా, మాజీ ఎంపిపి బొజ్జపురి అశోక్ ముఖర్జీ, నాయకులు ఆదరి రవీందర్, మీస మహేష్ బొల్లంపెల్లి షెడ్రక్, దస్తరి శ్రవణ్ కుమార్,మాడుగుల సంపత్, నేతుల మోహన్, అంబాల రాజ్ కుమార్, పూర్ణచందర్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయి ...






ఖమ్మం/తల్లాడ జూన్ 1 (అక్షరంన్యూస్)
తల్లాడ మండలంలో అర్హులు గల ప్రజలందరికి కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతాయి సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మంగళవారం తల్లాడ మండలం తల్లాడ గ్రామ రైతు వేదిక లో తల్లాడ మండలానికి సంబంధించిన కల్యాణ లక్ష్మి చేతులను ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఆర్ గ్యారంటీలో భాగంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో తహసిల్దార్ రవి కుమార్, ఎస్సై కొండలరావు, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, తల్లాడ మండలం, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మున్నేరు నుంచి పాలేరు వరకు గ్రావిటీ కాలువకు ప్రతిపాదన..

**పొంగులేటి ప్రసాద్ రెడ్డి వద్ద ఇరిగేషన్ అధికారుల ప్రస్తావన..**

ఖమ్మం/తల్లాడ జూన్ 18 (అక్షరంన్యూస్)
కూసుమంచి :మున్నేరు నుంచి పాలేరు వరకు గ్రావిటీ కాలువను నిర్మించడం ద్వారా పాలేరు నియోజకవర్గ ప్రజలకు సాగునీరు, తాగునీరుకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి వద్ద ఇరిగేషన్ డీఈ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు ప్రస్తావించారు. దీనికి పొంగులేటి ప్రసాద్ రెడ్డి సుముఖత వ్యక్తం చేసి ఈ విషయాన్ని తన సోదరుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో చర్చించి అమలు చేద్దామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి పొంగులేటి కట్టుబడి ఉన్నారని ప్రసాద్ రెడ్డి తెలిపారు.
పాలేరు క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం అయిన సందర్భంగా పై విషయం చర్చకు వచ్చింది.



## మరోసారి మానవత్వాన్ని చాటుకున్న తల్లాడ పోలీసులు..

**తల్లాడ ఎస్సై కొండలరావు ఆధ్వర్యంలో గుర్తుతెలియని మహిళ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి...**



ఖమ్మం/తల్లాడ జూన్ 18 (అక్షరంన్యూస్)
గత రెండు రోజుల క్రితం ఖమ్మం జిల్లా తల్లాడ బస్టాండ్ ఆవరణలో గుర్తుతెలియని మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తల్లాడ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బి. కొండలరావు ఆధ్వర్యంలో ఘటన స్థలాన్ని పరిశీలించి శవాన్ని ఖమ్మం మార్చురీకి తరలించారు. గత రెండు రోజులుగా ఆ మహిళకు సంబంధించిన కుటుంబసభ్యులు, బంధువులు వచ్చినప్పటికీ వారి ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవటంతో ఖమ్మంలో అన్నం ఫౌండేషన్ సహకారంతో తల్లాడ పోలీసులే ఆమె మృతదేహాన్నికి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లాడ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు దగ్గరుండి పర్యవేక్షించారు. ఇటీవల కాలంలో అనేక ప్రమాదాలు, మతిస్థిమితం లేని వారు ప్రమాదవశాత్తు మరణించినా, గాయపడినా తల్లాడ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్న ఘటనలు ఉన్నాయి. తల్లాడ ఎస్సై కొండలరావే స్వయంగా దగ్గర ఉండి అనేకమంది రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని కాపాడిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గుర్తుతెలియని మహిళ చనిపోతే వాటికి అయ్యే ఖర్చులతో పాటు ఆమెకు అంత్యక్రియలు నిర్వహించి మరోసారి మానవత్వాన్ని చాటుకొని ఆదర్శంగా నిలిచారు. దీంతో తల్లాడ ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బందికి పలువురు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

## యల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయి..

ఖమ్మం/ తల్లాడ జూన్ 18 (అక్షరంన్యూస్)
తల్లాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, నీలాద్రి ఆలయ డైరెక్టర్ దగ్గుల నాగిరెడ్డి, ప్రముఖ పాల వ్యాపారి దగ్గుల వెంకటేశ్వర రెడ్డి పొలంలో యల్లమ్మ తల్లి గుడి వద్ద మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన నాగిరెడ్డి సోదరులు కుటుంబ సభ్యులను ఆమె ఆప్యాయంగా పలకరించారు. అదేవిధంగా కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, దగ్గుల రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొండలరావు, నాయకులు దుండేటి వీరారెడ్డి, రాయల రాము, తుమ్మలపల్లి రమేష్, పొట్టేటి జనార్దన్ రెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టర్ గోవిందు శ్రీనివాసరావు, మారెళ్ళ మల్లికార్జున రావు, తాళ్ల జోసెఫ్, కొమ్మినేని వెంకటేశ్వరరావు(కె.వి), పొన్నం కృష్ణయ్య, గోవిందు శ్రీనివాసరావు ట్రాక్టర్, వడ్డే రామారావు, పగడాల లచ్చిరెడ్డి, కేతేపల్లి భాస్కరరావు, బొడ్డు వెంకటేశ్వరరావు, రావుల గోపి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్ఆర్ఆర్ కు మాజీ మంత్రి జానా రెడ్డి సన్మానం..



**ఖమ్మం/ తల్లాడ జూన్ 18 (అక్షరంన్యూస్)**

హైదరాబాద్: సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఖమ్మం పార్లమెంట్ సభ్యునిగా అత్యధిక మెజారిటీ తో గెలుపొందిన రామసహాయం రఘురాం రెడ్డి ని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో మొదటి అత్యధిక మెజారిటీ తన కుమారుడు రఘువీర్ రెడ్డి కి రాగా, రెండో అత్యధిక మెజారిటీ ఆర్ఆర్ఆర్ కి రావడం గర్వించదగిన విషయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కుటుంబం ఆర్ఆర్ఆర్ కుటుంబం అని జానారెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఎంపీ , జానా రెడ్డి తనయుడు రఘువీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా పోటీకి నామినేషన్ దాఖలు చేసిన గుమ్మడివెల్లి శ్రీనివాస్



**ఖమ్మం/తల్లాడ జూన్ 18 (అక్షరంన్యూస్)**

ఖమ్మం నగరంలో మంగళవారం స్థానిక గుట్టల బజార్ కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో ఉన్న జిల్లా ఆర్యవైశ్య కార్యాలయంలో ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ 2024-26 నూతన అధ్యక్షుని పోటీకి గుమ్మడివెల్లి శ్రీనివాస్ ఆర్యవైశ్య మిత్రులతో కలిసి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు గెల్లా జగన్మోహన్రావు , వనమా విశ్వేశ్వరరావు లకు మరియు ఎన్నికల పర్యవేక్షకులు నూకల శ్రీనివాసరావు , చారుగుండ్ల వెంకట లక్ష్మీ నరసింహారావు లకు అందజేశారు . తను గతంలో 2022 2024 ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా గోళ్ళ రాధాకృష్ణమూర్తి వారి పాలకవర్గం మరియు కార్యవర్గం సాయ సాకారాలతో , దాతల సహాయ సహకారాలతో ప్రధాన కార్యదర్శిగా ఉంటూ పేద నిరుపేద ఆర్యవైశ్యులకు అండగా ఉండి ఆర్థిక సహాయం మరియు పలు సేవా కార్యక్రమాలు చేశారని అన్నారు . ఈసారి అధ్యక్షుడిగా అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆదరిస్తే మరింతగా అభివృద్ధి చేస్తూ సంఘాన్ని ముందుకు తీసుకెళ్తానని , ఎల్లవేళల్లో ఆర్యవైశ్యులకు వెన్నంటుగా ఉండి ఆర్యవైశ్యుల సంక్షేమ కోసమే శక్తివంచన లేకుండా కృషి చేశారని అన్నారు .

## మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డికి ఘన స్వాగతం పలికిన జర్నలిస్టులు...



**ఖమ్మం/తల్లాడ జూన్ 18 (అక్షరంన్యూస్)**

టి యు డబ్ల్యు రాష్ట్ర మూడో మహాసభలు ఖమ్మం లో జరుగుతున్న సందర్భంగా మహాసభల్లో పాల్గొనేందుకు వచ్చిన ఐజ యు జాతీయ అధ్యక్షులు మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి కి ఆయనతో పాటు వచ్చిన అతిథులకు టి యు డబ్ల్యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఘన స్వాగతం పలికారు. ఖమ్మంలోని ఉషా హరి కన్వెన్షన్ హాల్లో ఈనెల 19 20 రెండు రోజులపాటు రాష్ట్ర మూడో మహాసభలు జరగనున్నాయి. శ్రీనివాసరెడ్డి తో పాటుగా టి యు డబల్యూ జేఐజేయు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నగునూరి శేఖర్ విరహతలి తోపాటుగా పలువురు అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు. టి యు డబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రామనారాయణ నేతృత్వంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి తో పాటుగా అతిధులకు ఘనంగా సత్కరించారు.

## గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం పై డి ఎల్ పీ ఓ విచారణ



**రాజన్న సిరిసిల్ల/గంభిరావుపేట/జూన్18(అక్షరం న్యూస్)**

గంభీరావుపేట మండల%శీ% నాగంపేట గ్రామ పంచాయతీ లో నిధుల దుర్వినియోగం పై గ్రామ పెద్దలు మరియు ఎంపీటీసీ మేర్గు నాగభూషణం ఇటీవల కలెక్టర్ గారికి సర్పంచ్ దోమకొండ లక్ష్మి మరియు కార్యదర్శి స్రవంతి పై పిర్యాదు చేయగా ఈ రోజు %ఋూూ% నరేష్ గ్రామ పంచాయతీ కార్యాలయం లో గ్రామ పెద్దలు మరియు గ్రామస్తుల సమక్షంలో పిర్యాదు చేసిన అంశంలపై విచారణ జరిపినారు. పాత ట్యాంకర్ కు రంగులు వేసి కొత్త ట్యాంకర్ కొనుగోలు చేసినట్లు బిల్లులు పెట్టి డబ్బులు డ్రా చేశారని, గ్రామం లో మొక్కలు నాటకున్నా, కొత్త మొక్కలు నాటినట్లు రికార్డు చేసి డబ్బులు ఇద్దరు వాడుకున్నారని,అలాగే కంపోస్ట్ ఎరువుల డంపింగ్ యార్డ్ పేరట 96000 రూపాయలు డ్రా చేసి వాడుకున్నారని, ఇవే కాకుండా ఇంకా వివిధ పనులు చేశామని చెప్పి లక్షల రూపాయలు ప్రభుత్వ సొమ్ము వాడుకున్నారని, %ఋూూ% కు విచారణ లో తెలిపారు. సర్పంచ్ మరియు కార్యదర్శి వద్ద ఇట్టి దుర్వినియోగం చేసిన డబ్బును రికవర్ చేయించాలని, అలాగే కార్యదర్శి శిరీష ని సర్పంచ్ లక్ష్మికి కొమ్ము కాచి ప్రభుత్వనిధులు నొక్కేసినందున తగిన చర్యలు తీసుకుని గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరారు.

# కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ...

**ఎలాంటి షరతులు లేకుండా కౌలు రైతులకు భరోసా, గుర్తింపు కార్డులు ఇవ్వాలి...**

**నేడు తల్లాడ లో కౌలు రైతుల రాష్ట్ర సదస్సు..**

**తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**

ఖమ్మం/ వైరా జూన్ 18 (అక్షరంన్యూస్)

వైరా:- కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయుటకు జూన్ 19 బుధవారం తల్లాడ మండల కేంద్రము వాసివి కళ్యాణ మండపం లో కౌలు రైతుల రాష్ట్ర సదస్సు జరుగుతుంది అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు, మంగళవారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్ లో జరిగిన కౌలు రైతులు సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో 30 నుంచి 40 శాతం వ్యవసాయ సాగు దారులు గా కౌలు రైతులు ఉన్నారని,గత పది సంవత్సరాల కేసిఆర్ పరిపాలన లో కౌలు రైతులకు ఎలాంటి భరోసా, భద్రత లేకుండా పోయింది అని అన్నారు, రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు భరోసా, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల మానిఫెస్ట్ లో కాంగ్రెస్ పార్టీ పట్టాదారు కల్గిన రైతులతో ఎలాంటి సంబంధం లేకుండా కౌలు రైతులకు భరోసా ఇస్తామని హామీ ఇచ్చి నేడు భూమి యాజమాన్యం నుంచి బాండ్ అఫ్టవిట్ ఉంటే నే కౌలు రైతులకు భరోసా ఇస్తామని మాట మార్చటం మోస పూర్తి చర్య అన్నారు, కౌలు రైతుల సమస్యలు పై సమగ్ర విధానం రూపొందించాలి అని అందుకు తెలంగాణా రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూన్ 19 న తల్లాడ మండల కేంద్రము లో కౌలు రైతుల రాష్ట్ర సదస్సు జరుగుతుంది అని వందలాది మంది కౌలు రైతులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు, వ్యవసాయ రంగం లో అభివృద్ధి కుంటుపడుతుంది అని కార్పొరేట్, భారీ వ్యవసాయ అయితే తప్ప సన్న చిన్న కారు రైతులకు, కౌలు రైతులకు వ్యవసాయం మిగులు కంటే అప్పులు పెరిగి వ్యవసాయ రంగం నుంచి పూర్తిగా వైదోలింగే పరిస్థితి నెలకొంది అని అన్నారు, కౌలు రైతులకు 2011 ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్



కౌలు రైతుల చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు జారీ చేయాలని అందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖలు గ్రామ సభలు నిర్వహించాలి అని డిమాండ్ చేశారు, కౌలు రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి అని, పంట విక్రయం లో కౌలు గుర్తింపు కార్డులు అర్హత పత్రాలగా పరిగణనలోకి తీసుకోవాలి అని అన్నారు రాష్ట్ర కౌలు రైతులు సదస్సు కు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, కార్యదర్శి తీగల సాగర్, కౌలు రైతుల రాష్ట్ర కన్వీనర్ వి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొంటున్నారు అని అన్నారు, ఈ సమావేశంలో సుంకర సుధాకర్ తోట నాగేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ, వేల్పుల మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

## జన్కో యాష్ పాండ్ నుంచి అక్రమంగా బూడిద తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు జేసిబి లారీలు స్వాధీనం



**జ్యోతి నగర్ జూన్ 18 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

ఎన్ టి పి సి క్రషర్ నగర్ లోని యాష్ పాండ్ లోనీ బూడిదను ఎడ్ల సాయి తేజ ఏ బంటి, పి టి ఎస్ ఎన్టిపిసి నివాసం ఉంటు గత కొన్ని రోజులుగా అడిచర్ల శ్రావణ్ సాయంతో ఎక్స్కవేటర్ ద్వారా బూడిదను ఎలాంటి అనుమతులు లేకుండా దొంగతనంగా తోడి దానిని లారీలలో లోడ్ చేసి అక్రమంగా తరలించి అధిక ధరలకు అమ్ముకొని అక్రమాలకు పాల్పడ్డాడని గోదావరిఖని ఏసిపి రమేష్ తెలిపారు. ఎన్టిపిసి పోలీస్ స్టేషన్లో మంగళవారం రాత్రి ఆయన ఈ సంఘటన వివరాలు తెలిపారు.. మంగళవారం సాయంత్రం కూడా యాష్ పాండ్ లోని బూడిదను ఎక్స్కవేటర్ ద్వారా దొంగతనంగ లారీ లో లోడ్ చేసి తరలించుటకు ప్రయత్నిస్తుండగా తెలంగాణ జెన్కో సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని జెన్కో ఈ ఈ గద్దం సూర్యనారాయణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఎస్సై ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకొన్నారని ఆయన చెప్పారు. వారి వద్ద నుండి ఒక ఎక్స్కవేటర్, ఒక బ్రెజ కార్, మరియు %ూ02ఖఱ1325, ూ02ఖఱ%1326 గల రెండు లారీలను స్వాధీన పర్చుకొన్నారుని వివరించారు.

పట్టుబడిన నిందితుల వివరాలు

1. ఎడ్ల సాయి తేజ ఏ బంటి, తండ్రి సుదర్శన్ బాబు, 28 సంవత్సరాలు, మున్నూరు కాపు నివాసము పి టి ఎస్ ఎన్టిపిసి
2. ఆడిచెర్ల శ్రావణ, తండ్రిపేరు: మల్లేశం, 33 సం, నివాసం: లక్ష్మీపూర్, ఎన్టిపిసి
3. లారీ డ్రైవర్ - సౌదాగర్, తండ్రి పేరు బుట్టు అలీ, 33 సంవత్సరాలు, %తీ/శీ% లాల్ గంజ్, యూపీ, ప్రస్తుత నివాసం కరీంనగర్
4. లారీ డ్రైవర్ పేరు రామ్ జనం చౌహాన్, తండ్రి పేరు లాల్ జి, 29 సంవత్సరాలు, నివాసం రేహ (%ఙ%), మీర్జాపూర్ జిల్లా, యూ పి ప్రస్తుత నివాసం కరీంనగర్

పట్టుబడిన నిందితులను రిమాండ్ కి తరలించడమైనది అని గోదావరిఖని ఏసిపి రమేష వివరించారు. ఈ సందర్భంగా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారిపై అయిన కఠిన చర్యలు తీసుకోబడతాయి అని హెచ్చరించినరు. ఈ కార్యక్రమం లో రామగుండం సిఐ. అజయ్ బాబు , ఎన్టిపిసి ఎస్సై ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

## టియు డబ్ల్యు జే (ఐజేయు) యు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి...

ఖమ్మం/ తల్లాడ జూన్ 18 (అక్షరంన్యూస్)



టియు డబ్ల్యు జే(ఐజేయు) రాష్ట్ర మహాసభలు బుధవారం ఖమ్మంలో బైపాస్ రోడ్ లోని ఉష హరి కన్వెన్షన్ హాల్లో జరుగుతున్నాయి. ఈ రాష్ట్ర మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా టి యు డబ్ల్యూ (ఐజేయు) నాయకులు వస్తున్నారు . బుధవారం జరిగే రాష్ట్ర మహాసభలకు వైరా డివిజన్ నుండి పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలిరావాలని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఏపూరి రాజారావు ,పులి కృష్ణార్జునరావు, ఎక్కిరాల శ్రీనివాసరావు, గద్వాల్ రవీందర్, మేడ సంపత్ ,కొత్త వెంకటేశ్వరరావు,గొళ్ళమందల విజయ్,అదురి ప్రేమ్,దాసరి శ్రీనివాస్ రావు, ఆది శ్రీకాంత్,అక్కిశెట్టి రవితేజ, కాకాటి వినోద్,నవీన్ ,అతాఉల్ల, సూతకాని శ్రీకాంత్, గొల్లమందల బాబు, ఏదు నూతన బుచ్చి రామారావు, సుభాని ,మోదుగు వినోద్,పొషం శ్యామ్,చారి,సాయి,రేచెర్ల నాగరాజు, సీత రాములు, విజయ్, మనోహర్, ముదిగొండ మహేష్,వల్లేపు రాము,క్రిష్ణా,మల్లు మదులత. తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాగూర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



**జ్యోతి నగర్ జూన్ 18 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్లి గారి ఆదేశాల మేరకు ఇటీవల సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైస్ మిల్లు లో హత్యకు గురైన ఆరేళ్ల చిన్నారి ఆత్మశాంతికై కాంగ్రెస్ పార్టీ మహిళా కాంగ్రెస్ నాయకురాలు మనాలి ఠాగూర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గోదావరిఖని చౌరస్థలో క్యాండిల్ ర్యాలీ జరిగింది. మార్కండేయ కాలనీ నుంచి గోదావరిఖని చౌరస్తా వరకు మహిళలతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాగూర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల వద్ద నిద్రిస్తున్న ఆరేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారం జరపడంతో పాటు హత్య చేయడం అది కిరాతమని అన్నారు నిందితుడిని కఠినంగా శిక్షించాలి అదేవిధంగా సహస్ర తల్లిదండ్రులను గౌరవనీయులు ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దుల శ్రీధర్ బాబు మరియు గౌరవ మంత్రివర్యులు సీతక్క గారు రామగుండం శాసనసభ్యులు గౌరవనీయులు రాజ్ ఠాకూర్ శాసనసభ్యులు విజయరమణరావు తో పాటు ప్రభుత్వం అండగా ఉంటది తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఈ నెల 20 వ తేదీన శ్రీశ్రీశ్రీ నాగులమ్మ దేవాలయ 17వ వార్షికోత్సవ వేడుకలు

రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 18/ అక్షరం న్యూస్ : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ క్వార్టర్ సర్కిల్ దగ్గర శ్రీశ్రీశ్రీ నాగులమ్మ దేవాలయ 17వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 20 వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. అందులో భాగంగా గురువారం ఉదయం 6 గంటలకు అభిషేకము, 11 గంటలకు అమ్మవారి అలంకరణ, మధ్యాహ్నం 12 గంటలకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ వార్షికోత్సవంలో భక్తులు విచ్చేసి తీర్థ ప్రసాదాలు తీసుకోవాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## గార్ల పెద్దచెరువు ఆయకట్టు శిఖం భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి...

**చెరువు కింద అర్హులైన సాగు రైతులకు పట్టాలు ఇచ్చి రైతుబంధు పథకం వర్తింపచేయాలి...**

**అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా...**



**మహబూబాబాద్ /గార్ల /జూన్ 18/అక్షరం న్యూస్...**

మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల పరిధిలోని గార్ల పెద్దఆయకట్టు చెరువు శిఖం భూములు 150 ఎకరాలను అక్రమంగా ఆక్రమించుకొని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెరువు శిఖం భూములలో బావులు తీసి, విద్యుత్ మోటార్లతో సాగు చేస్తున్న ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గార్ల మండల అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. గార్ల పెద్దచెరువు ఆయకట్టు శిఖం భూములను అక్రమంగా ఆక్రమించుకున్న ఆక్రమణ దారులపై చర్యలకు డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అఖిలపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ,గార్ల పెద్దచెరువు ఆయకట్టు శిఖం భూములను ఆక్రమణ దారుల నుండి కాపాడుటకు చుట్టూ బౌండ్రి ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు.చెరువు కింద ఉన్న రైతులకు ఎస్ టీ అర్హతతో భూములకు పట్టాలు ఇచ్చి రైతుబంధు పథకం వర్తింపచేయాలనీ కోరారు.తక్షణమే గార్ల పెద్దచెరువు 150ఎకరాల ఆయకట్టు శిఖం భూములను ఆక్రమించుకున్న వారిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ గార్ల మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్,ఎం. గిరి, సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, మండల కార్యదర్శి జంపాల వెంకన్న, సిపిఐ (ఎమ్ -ఎల్ )న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి. సక్రు,రైతులు ప్రభాకర్, వీరు, మనోహర్, లాలు, కస్నా, సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం

రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -18(అక్షరం న్యూస్ )

నాలుగు రోడ్ లు కలిసే జంక్షన్ ఉండడటం తో. తరుచు ప్రమాదాలు సంభావిస్తున్నాయి అని, రహదారి కి నాలువైపుల స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పటు చేయాలనీ రాజన్న సిరిసిల్ల ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారికి బంధన్ కల్ మాజీ సర్పంచ్ జెల్ల వెంకటస్వామి వినతి పత్రం అందచేశారు.రోడ్డుకు ఇరువైపులా పలు విద్యాసంస్థలు కలవనీ, విద్యార్థులు తమ విద్యా సంస్థలకు వెళ్లే తరుణంలో ఈ వాహనాల అతివేగం వలన అనేక ప్రమాదాలకు గురౌవడం జరుగుతుందన్నారు. కేవలం విద్యార్థులే కాదు వాహనంపై వెళ్లేవారు కూడా వాహనాలు అతివేగం వలన వాహనాల ఓవర్టేక్ వలన ప్రమాదాల బారిన పడడం జరుగుతుందనీ తెలిపారు విద్యార్థులు సైకిల్ మీద పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాలన్న భయపడే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ లను సత్వరంగా ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని కొరమన్నారు

## వంగరలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

హనుమకొండ/భీమదేవరపల్లి/జూన్ 18(అక్షరం న్యూస్):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర ఉన్నతశ్రేణి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఇండియన్ క్యాన్సర్ సొసైటీ వారి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి వైద్య ఆరోగ్యశాఖ సెంట్రల్ టీం సభ్యులు డాక్టర్ వరుణ్ విజయ్, డాక్టర్ తేజ్ కిరణ్ రెడ్డిలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 341 మంది గ్రామస్తులు పాల్గొన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. అనంతరం ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, హెూమియో వైద్యశాలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను, ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సిన్ రూమ్, లేబర్ రూమ్ లను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, అడిషనల్ డి ఎం హెచ్ ఓ డాక్టర్ మదన్ మోహన్ రావు, డాక్టర్ యాకుబ్ పాషా, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఉమా శ్రీ రెడ్డి, డాక్టర్ అహ్మద్, డాక్టర్ హిమబిందు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రెహమాన్, డాక్టర్ రూబీన, డాక్టర్ రాజశేఖర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అందని ద్రాక్షలా మారుతున్న వైద్యం

- భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు పెంచాలి
- పేదలకు మెరుగైన వైద్యం అందించాలి
- అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు




భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం/ జూన్ 18/ అక్షరం న్యూస్ : 200 పడకల ఆసుపత్రిగా భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ అభివృద్ధి చెందినా కావలసిన వైద్యులు అందుబాటులో లేకపోవడం, వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడం, సరిపడా స్టాఫ్ లేకపోవడంతో పేదలకు వైద్యం అందని ద్రాక్ష పండులా ఉన్నదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ సమావేశం నాదెళ్ల లీలావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ వర్షాకాలం ప్రారంభమైనందున విష జ్వరాలు, అంటు వ్యాధులు,ప్రభలే అవకాశం ఉందని అందువల్ల ముందస్తుగా వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని ఆయన అన్నారు. నాలుగు రాష్ట్రాలకు కేంద్రంగా ఉన్న భద్రాచలంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా వైద్యులు లేక వైద్య పరికరాలు లేక నర్సింగ్ స్టాఫ్ లేకపోవడంతో పేదలకు సక్రమంగా వైద్యం అందడం లేదని ఆయన అన్నారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సమస్యలు పరిష్కరించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం అయినా భద్రాచలం హాస్పిటల్ అభివృద్ధిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. భద్రాచలం పట్టణంలో పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ గృహాలను అర్హులైన పేదలకు పంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శివర్గ సభ్యులు పి సంతోష్ కుమార్ పట్టణ కమిటీ సభ్యులు డి సీతాలక్ష్మి ,ఎన్ నాగరాజు, జీవనజ్యోతి, జి లక్ష్మీకాంత్, ఎస్ భూపేంద్ర పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి...

**ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఐద్వా ఆధ్వర్యంలో ప్రైవేటు విద్యాసంస్థల సర్వే...**



భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం/ జూన్ 18/ అక్షరం న్యూస్ :

నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యను పారంగా మారుస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఐద్వా పట్టణ కార్యదర్శులు భూపేందర్ సతీష్ బాబు డి సీతాలక్ష్మి లు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని శ్రీ చైతన్య త్రివేణి శ్రీ విద్య విద్యాసంస్థలలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ కార్పొరేట్ స్థాయి ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చూసీచూరినట్టు యెహరిస్తున్నారని విమర్శించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి పాఠశాలలో 25 శాతం మంది విద్యార్థులకు ఉచిత విద్య అందించాల్సి ఉండగా అవేమీ ఇక్కడ అమలు జరగటం లేదని వేళలో ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాల పేరుతో మరి ఇంతగా దోపిడీ చేసుకుంటున్నారని ఆరోపించారు. స్కూల్ నిర్వహించే బస్సులు సైతం ఫిట్నెస్ లేకుండా కనీస భద్రత కూడా లేకుండా వస్తున్నారని ఆర్టిఏ అధికారులు విద్యాసంస్థల నిర్వహించే బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రతి విద్యా సంస్థ ముందు ఫీజుల పట్టికను ఉంచాలని అదేవిధంగా పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేసి ఫీజులు నియంత్రణ చేపట్టాలని కనీస చట్టాలను కూడా పాటించని విద్యాసంస్థలపై కఠినంగా వ్యవహరించకపోతే ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఐద్వా ఆధ్వర్యంలో పోరాటాలు ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి రాధా కనక శ్రీ సిఐటియు నాయకులు సంతోష్ కుమార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# భలా... గిరి బిడ్డ...!

- **జాతీయస్థాయిలో ప్రతిభ**
- **అథ్లెటిక్స్ పోటీలో భద్రాచలం గిరిజన గురుకులం విద్యార్థినికి రజత పతకం**



భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం /జూన్ 18/ అక్షరం న్యూస్ :

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలో భద్రాచలం గిరిజన గురుకులంకు చెందిన విద్యార్థిని అద్వితీయ ప్రతిభ కనబరిచింది. రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. చత్తీస్గడ్ రాష్ట్రం బిలాస్ పూర్ లో 19వ నేషనల్ యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు జూన్ 15,16, 17 వ తేదీల్లో జరిగాయి. ఈ పోటీల్లో భద్రాచలం గిరిజన గురుకులానికి చెందిన హెచ్ఇసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న టి శ్రీ తేజ పాల్గొని రజత పతకాన్ని కైవసం చేసుకుంది. మారుమూల ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఈ గిరిజన విద్యార్థిని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తన ప్రతిభ చాటటం విశేషం. తమ కళాశాలకు చెందిన శ్రీ తేజ జాతీయస్థాయిలో రాణించటం పట్ల భద్రాచలం గిరిజన గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి తుమికి వెంకటేశ్వరరాజు, భద్రాచలం గిరిజన గురుకులం ప్రిన్సిపాల్ ఎం. దేవదాసు ప్రత్యేకంగా అభినందించారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు జాతీయస్థాయిలో అథ్లెటిక్స్ పోటీల్లో తెలంగాణ నుంచి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన భద్రాచలం గురుకులంకు చెందిన శ్రీ తేజను గిరిజన గురుకులాల సెక్రటరీ కే సీతామహాలక్ష్మి ఐఏఎస్ ప్రత్యేకంగా ప్రశంసించినట్లు ప్రిన్సిపాల్ ఎం దేవదాసు ఈ సందర్భంగా వెల్లడించారు.

# మీడియా రంగానికే వన్నెతెచ్చిన రామోజీరావు

రామోజీరావు సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి: ఎస్.కే.సాబీర్ పాషా




భద్రాద్రి జిల్లా /చుంచుపల్లి /జూన్.18/ అక్షరం న్యూస్ : మీడియా రంగానికే వన్నెతెచ్చిన రామోజీరావు పలువురికి ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి మండలం కమ్మవారి కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన రామోజీరావు సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై... తొలుత రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్ మాట్లాడుతూ సమాచార వ్యవస్థకు ప్రజలు దూరంగా ఉంటున్న పరిస్థితిలో ఈనాడు పత్రికను, ఆ తర్వాత ఈటీవీ ఛానల్లను స్థాపించి మీడియా రంగంలో ప్రత్యేకతను చాటారన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీ, చిట్ ఫండ్, ఆహార ఉత్పత్తుల సంస్థలు ఏర్పాటుచేసి వ్యాపార రంగంలో దిగ్గజంగా నిలిచాడని, ఆయన స్థాపించిన మీడియా సంస్థలు, వ్యాపార సంస్థల్లో లక్షలాదిమంది ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. మీడియా, వ్యాపార రంగానికి ఆయన ఆదర్శమని కొనియాడారు.

# భద్రాచలం ఐటీడీఏ పిఓ ను బదిలీ చేసిన ప్రభుత్వం కొత్త పిఓను తక్షణమే నియమించాలి. జి.ఎస్.పి



భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం/ జూన్ 18/ అక్షరం న్యూస్ : ఐటీడీఏ ముందు గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు ముత్తవరపు జానకిరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ గత పిఓ గారు బాధ్యతలు తీసుకున్న దగ్గర నుండి ఐటి డీఏలో ఉన్న అన్ని యూనిట్ అధికారులను సమన్వయంతో పనిచేసుకుంటూ ముఖ్యంగా ఏజెన్సీలో విద్య వైద్యం పై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగారని భద్రాచలం ఐటిడిఏ పరిధిలో 23 ఏజెన్సీ మండలాలు ఉన్నాయని ఐటిడీపీఓగా వచ్చే అధికారి కనీసం రెండు సంవత్సరాలు పనిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

ఐటీడీఏ అంటేనే ఆదివాసీలకు మినీ కలెక్టరేట్ గా భావించి సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశతో నిత్యం ఐటీడీఏకు ప్రజలు వస్తుంటారని ప్రభుత్వం తక్షణమే ఐఏఎస్ ఆఫీసర్ ను ఐటిడిఏ పిఓగా నియమించి ఆదివాసీల సమస్యలు పరిష్కార మార్గంగా చూడాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాము ఈ యొక్క కార్యక్రమంలో వజ్జ్ వాసు చాపల నాగేంద్రబాబు కిష్ట శ్రీనివాసరావు .

# వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని బీజేఎంసీలో ముందస్తు చర్యలు : బీజేఎంసీ కమిషనర్ శరత్‌చంద్ర




రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 18/ అక్షరం న్యూస్ : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని కార్పోరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. మంగళవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పోరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్, పీరంచెరువు, జేఎన్ఎన్‌యూఆర్ఎం డ్రైనేజీ పనులను పర్యవేక్షించామన్నారు. వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్ జగన్, డ్రైనేజీ టీం కాళిదాసు, సంతోష్, పోచయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# తై బజార్‌ను కైవసం చేసుకన్న మహమ్మద్ దస్తగిరి



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 18/ అక్షరం న్యూస్ : మణికొండ మున్సిపల్ పరిధిలో తై బజార్ వేలం ప్రక్రియను మంగళవారం పూర్తి చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేలం కార్యక్రమంలో మహమ్మద్ దస్తగిరి అనే వ్యక్తి తై బజార్ వేలం లో పాల్గొని రూ.31.05 లక్షలకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ తై బజార్‌ను వేలంలో సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందననారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ మేనేజర్ రమేష్, రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మహమ్మద్ దస్తగిర్, అజర్ అహ్మద్‌లు



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 18/ అక్షరం న్యూస్ : బక్రీద్ వేడుకలను పురస్కరించుకొని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు మహమ్మద్ దస్తగిర్, అజర్ అహ్మద్ లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యేను వారు మర్యాదపూర్వకంగా మైలార్‌దేవ్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిశారు.

# మణికొండ మున్సిపాలిటీలో 12 ఫీట్ల పాము కలకలం



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జూన్ 18/ అక్షరం న్యూస్ : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీ రోడ్ నెంబర్ 4 లో 12 ఫీట్ల పాము కనిపించడం అందరినీ ఆందోళనకు గురి చేసింది. 12 ఫీట్ల పాములు చూసిన ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురై స్నేక్ క్యాచర్ కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న స్నేక్ క్యాచర్ చాకచక్యంగా 12 ఫీట్ల పాములు పట్టుకున్నాడు. దీంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు.

# కార్మికులకు ఆటంకం కలిగిస్తే ఊరుకునేదే లేదు

- **రాజకీయ నాయకులు తమ బంధు వర్గాన్ని హమాలీలుగా నియమించుకునే ఆలోచన విరమించుకోవాలి.**
- **ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్.**

నాగర్ కర్నూల్ జూన్ 18(అక్షరం న్యూస్)

మద్యం గోదాంలో పనిచేస్తున్న హమాలి కార్మిలకు రాజకీయ నాయకులు అటంకం కలిగిస్తే ఉరుకునేదే లేదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్ మండిపడ్డారు. మంగళవారం తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఉన్న మద్యం గోదాంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గూర్చి చర్చించారు అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు మాట్లాడారు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని చాలా కాలంగా రాష్ట్ర ప్రభుత్వ%శీ%తో పోరాటాల ఉద్యమలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వలు మొట్ట మొదట హమాలీ కార్మికులకు పని భద్రత లేకపోవడం ఆ పనికి తగ్గ ఫలితాలు రాకపోవడం అనేది చాలా విచారకరమైన విషయం దానికి తోడు దేశనికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన నేటికీ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇయ్యాల్సినటువంటి బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నప్పటికీ స్వయం ఉపాధి కార్యక్రమాలు చేసుకుంటున్నటువంటి హమాలి కార్మికులకు పనులకు రాజకీయ నాయకులు ఆటంకం కలిగిస్తూ అనేక రకాల ఇబ్బందులను గురి చేసినటువంటి పరిస్థితిని కల్పిస్తున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలో మద్యం గోదాంలో హమాలీలుగా పని చేస్తున్నటువంటి 71 మంది హమాలి కార్మికులు తమ రెక్కలు ముక్కలు చేసుకుని నడుములో మోకాళ్ళ, అరిగిపోయేలా పని చేస్తున్నప్పటికీ ఆశిస్తున్నటువంటి ఫలితం లేక పని భద్రత లేక హమాలీ కార్మికులు అనేక అవస్థలకు గురవుతున్నారు. అలాంటి వారి పట్ల స్థానికంగా ఉన్నటువంటి రాజకీయ నాయకులు ఆ యొక్క పనిమీద కన్నేసి ఈ కార్మికులను తొలగించి వారి స్థానంలో రాజకీయ నాయకుల బంధు వర్గాన్ని నియమించే ఆలోచన ఎప్పటికీ నెరవేరదని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలకు హమాలీలకు కార్మికులు ఓట్లు వేసి గెలిచిన రాజకీయ నాయకులే హమాలి కార్మికులకు వ్యతిరేకంగా నిలబడడం శ్రేయస్కరం కాదని ఆయన అన్నారు. మీకేమైనా చాతనైతే మీ ప్రభుత్వాలు గతంలో 75 సంవత్సరాలుగా హమాలిలకు ఇతర కార్మికులకు ఏ సౌకర్యాలు కల్పించలేదని ఆయన వాపోయారు. ప్రమాదాలు జరిగితే ప్రమాద నష్టపరిహారం చెల్లించలేదని సమగ్ర మైనటువంటి చట్టాన్ని తీసుకురావాలి. ఇంత చేతగాని పరిపాలన చేసినటువంటి రాజకీయ పార్టీల నాయకులు చేతగాని కార్మికుల మీద దాడుల అని ప్రశ్నించారు. కార్మికుల మీద మీ ప్రతాపం చూపించడం అది చాలా విడ్డూరపు సర్య అని అన్నారు. అనవసరమైనటువంటి ప్రయత్నాలను మానుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కార్మిక నాయకులు జీవన్ రాజు ఆంజనేయులు మీదింటి రవి కృష్ణ శ్యామ్ జోగుశేఖర్ వున్నారు.

# కృషి విజ్ఞాన కేంద్రం, వైరాలో పీఎం కిసాన్ 17వ విడత లైవ్ టెలిక్యాస్ట్ కార్యక్రమం..



ఖమ్మం/వైరా జూన్ 18 (అక్షరంన్యూస్)

కృషి విజ్ఞాన కేంద్రం వైరా నందు ప్రధానమంత్రి

నరేంద్ర మోడీ పిఎం కిసాన్ సమ్మన్ యోజన ద్వారా 17వ విడత రైతులకు అందించే పెట్టుబడి సాయం అర్హులైన ఒక్కో రైతు ఖాతాలోకి 2000 రూపాయలు జమ చేసే కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ ద్వారా రైతులకు చూపించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో తొమ్మిది కోట్ల 26 లక్షల మంది లబ్ధిదారులకు 20 వేల కోట్లు రూపాయలు బదిలీ అవుతున్నవి. ఖమ్మం జిల్లాలో 1.70 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా వీరికి ఇప్పుడు రూపాయలు రెండువేల చూపున 34 కోట్లు జమ అవుతున్నాయి. ఈ కార్యక్రమంను సాయంత్రం 5 గంటలకు ప్రత్యక్షంగా ఖమ్మం

జిల్లా రైతులు కృషి విజ్ఞాన కేంద్రం, వైరా నందు వీక్షించారు.

కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి ఎం. విజయనిర్మల పాల్గొని రైతులు పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొంది వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీ బీవీ రమణ పాల్గొని రైతులు ఆహార ధాన్యాలతో పాటు కూరగాయల సాగు మరియు ఇతర ఉద్యాన పంటలో వేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కార్యక్రమంలో వైరా వెటర్నరీ డాక్టర్ శ్రీ రాకేష్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు గొర్రెల పెంపకం

డైరీ కోళ్ల పెంపకం సమగ్రంగా సమీకృత వ్యవసాయం చేయాలని రైతులకు కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన మరియు విస్తరణ సలహా నెంబర్ శ్రీ రామ ప్రతాప్ మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాల వైపు మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో కృషిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం, వైరా కోఆర్డినేటర్ డాక్టర్. కె.రవి కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్. జెస్సీ సునీత. డబ్లు, శ్రీమతి.ఫనీశ్రీ మరియు కె.వి.కె సిబ్బంధి పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని లైవ్ టెలికాస్ట్ ని వీక్షించారు.

# గుత్తాపై గుర్రుగా ఉన్న గులబీ బాస్

- **మండలి ఛైర్మన్‌గా గుత్తాను తొలగించే ఎత్తులు**
- **పండలిలో పట్టు సాధించేందుకు కాంగ్రెస్ పై ఎత్తులు**

హైదరాబాద్,జూన్18( అక్షరం న్యూస్ :

ఎన్నికల హడావిడి ముగియడంతో ఇక రాజకీయ ఎత్తులు,పైఎత్తులకు తెలరలేవనుంది. ఎవరు ఎటువైపు ఉంటారన్నది తేలనుంది. మొత్తంగా బిఆర్ఎస్ రాజకీయంగా భారీ మూల్యాన్ని చెల్లించుకుంటుందన డంలో సందేహం లేదు. మరో ఐదేళ్ల వరకు బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అప్పటి వరకు కేసులు, అవినీతి వ్యవహారాలతో బిఆర్ఎస్ మరింతగా మూల్యం చెల్లించుకో తప్పదు. ఈ క్రమంలో బిజెపి, అధికార కాంగ్రెస్‌ల మధ్యనే రాజకీయం నడవనుంది. అలాగే శాసన మండలిలో తమ బలాన్ని పెంచుకునేందుకు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు సన్నద్ధమవుతోందన్న ప్రచారం వినిపిస్తోంది. ఈ క్రమంలో మండలి ఛైర్మన్ గుతాపై బీఆర్ఎస్ పెట్టడం ద్వారా పట్టు సాధించాలని బిఆర్ఎస్ ప్రతివ్యూహాలు పన్నుతోంది. అవిశ్వాస తీర్మానం, దీన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ అనుసరించనున్న

వ్యూహాలు.. తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారనున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పట్టు కోసం తెలంగాణ శాసన మండలి వేదికకానుందనడంలో సందేహం లేదు. చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ అధిష్టానం రెడీ అవుతోందని తెలుస్తోంది. ఇకపోతే మండలి ఛైర్మన్ గుత్తా సహా మెజార్టీ ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం కూడా ఉంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగలడంతో మండలిలో పట్టుకు కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతున్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉంటున్న శాసన మండలి చైర్మన్ గుత్తాకు వ్యతిరేకంగా అవిశ్వాసం నెగ్గితే రాజకీయంగా పైచేయి చాటుకోవచ్చని బీఆర్ఎస్ అధిష్టానం వ్యూహాలు పన్నుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలోరాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవిశ్వాస తీర్మానాలతో స్థానిక సంస్థలను అన్నింటిని కైవసం చేసుకుం టోంది. అసెంబ్లీ ఎన్నికలు విజయ దుందిభీ మోగించిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా గట్టి పట్టునే సాధించింది. మరోవైపు బీఆర్ఎస్ కు ఒక్క సీటు కూడా రాకుండా కాంగ్రెస్ ఖంగు తినిపించింది. శాసనసభలో బలం లేకపోయినా.. పెద్దల సభ శాసనమండలిలో ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని బిఆర్ఎస్ భావిస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్, బిజెపిల వైపు గోడ దూకేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉండడం, పార్లమెంట్ ఎన్నికల టైంలో సుఖేందర్ రెడ్డి కొడుకు అమిత్ రెడ్డి కాంగ్రెస్ చేరడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలవేళ బీఆర్ఎస్‌లోని గుత్తా అనుచరులు మొత్తం గంపగుత్తగా కాంగ్రెస్ చేరారు. తొలుత అమిత్ రెడ్డి నల్గొండ, భువనగిరి నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఆశించగా.. ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ మాజీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పెద్దలకు ఫిర్యాదు చేసినా





ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుఖేందర్ రెడ్డి.. కేసీఆర్, బీఆర్ఎస్‌పై ఫైర్ అయ్యారు. కేసిఆర్ చెప్పుడు మాటలు వినడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని ఎంపీ ఎన్నికల సమయంలో గుత్తా సుఖేందర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ పరిణామాల నేపథ్యంలో సుఖేందర్ రెడ్డిని చైర్మన్ పదవి నుంచి దింపాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌లో నెగ్గడం ద్వారా అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేయవచ్చునే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో జరుగుతోంది. గుత్తాపై అవిశ్వాస తీర్మానంలో నెగ్గితే ఓ రకంగా రేవంత్ రెడ్డి దూకుడుకు చెక్ పెట్టినట్టేనని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి..

తెలంగాణ శాసన మండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 40 కాగా, ప్రస్తుతం రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు మినహాయిస్తే ప్రస్తుతం మండలిలో 38 మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. మండలి చైర్మన్ పదవి నుంచి దింపడానికి మొత్తం సభ్యుల్లో 2/3 వంతు మెజార్టీ ఉండాలి. ప్రస్తుతం 27 మంది సభ్యులు అవిశ్వాసానానికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీఆర్ఎస్ పక్షాన 31 మంది ఎమ్మెల్సీలు ఉన్నట్టు మండలి రికార్డులు చెప్తున్నాయి. కానీ దామోదర్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ ఎమ్మెల్సీగా గెలిచారు. చైర్మన్ సుఖేందర్ రెడ్డితో కలిపితే కాంగ్రెస్ సంఖ్య ఆరుకు పెరిగింది. వీరిని మినహాయిస్తే బీఆర్ఎస్ తరపున 26 మంది ఉంటారు. ఎంఐఎంకు ఇద్దరు ఎమ్మెల్సీలు ఉండగా, బీజేపీకి ఒకరు ఉన్నారు. టీచర్ ఎమ్మెల్సీలు ఇద్దరు ఓటింగ్ కు దూరంగా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి శాసనసభలో తిరుగులేని బలం ఉన్నా.. మండలిలో మాత్రం బీఆర్ఎస్ పార్టీదే పైచేయిగా ఉంది. పలు కీలక బిల్లుల ఆమోదం, ఇతర

అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అడ్డంకిగా మారే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ శాసనమండలిలో 'ఆపరేషన్ ఆకర్ష కు సిద్ధమవుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రాష్ట్రం ఏర్పడినపుడు శాసనసభలో బీఆర్ఎస్ కు తిరుగులేని బలం ఉన్నా.. శాసన మండలిలో మాత్రం కాంగ్రెస్‌దే ఆధిపత్యం ఉండేది. అప్పట్లో.. అధికార బీఆర్ఎస్ మండలిలోని మెజారిటీ కాంగ్రెస్ ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకుంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారన్న వార్తలు రావడంతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. మండలి చైర్మన్ పై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం పెడితే ఆ పార్టీకి ఉన్న సంఖ్యా బలంతో తేలికగా నెగ్గుతుంది. సభలో బీఆర్ఎస్ ఆధిపత్యాన్ని గండి కొట్టేందుకు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష వైపు మొగ్గు చూపుతోంది. బీఆర్ఎస్ నుంచి 14 మంది ఎమ్మెల్సీలను చేర్చుకుంటే మండలిలో కాంగ్రెస్ సంఖ్యాబలం 20కి చేరుకుంటుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో బిఆర్ఎస్‌కు చెక్ పెట్టవచ్చని అనుకుంటున్నారు.

# తప్పులను సమర్థించుకుంటున్న కెసిఆర్

- **విద్యుత్ కొనుగోల్లో అక్రమాలను సమర్థించుకునే యత్నం**
- **జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఎదుట కోదండరామ్ వివరణ**

హైదరాబాద్,జూన్18( అక్షరం న్యూస్ :

కేసీఆర్ చేసిన తప్పులను సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం ఆరోపించారు. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్లు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఎదుట ఆయన హాజరయ్యారు. హైదరాబాద్ లోని బీఆర్కే భవన్‌లోని కమిషన్ కార్యాలయానికి కోదండరాంతో పాటు విద్యుత్ శాఖ అధికారి రఘు వచ్చారు. వారిద్దరి నుంచి కమిషన్ వివరాలు అడిగి తెలుసుకుంది. ఛత్తీస్‌గఢ్ తో 2000 మెగావాట్లకు ఒప్పందం చేసుకుంటే 200 మెగావాట్లు కూడా రాలేదని కాంపిటేటివ్ బిడ్డింగ్ కు వెళ్లుంటే రేట్లు తగ్గేవని.. ఎంవోయూ ద్వారా ముందుకెళ్లారని ఇది అనుమానించదగ్గదేనని కోదండరాం కమిషన్‌కు తెలిపినట్లుగా తెలుస్తోంది. ఛత్తీస్ గఢ్ తో కరెంట్ కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్లపై గతంలో అఫిడవిట్ వేశామని కోదండరాం మీడియాకు తెలిపారు. అందుకు సంబంధించిన ఆధారాలను కమిషన్ ముందు ఉంచామన్నారు. ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగించాలన్నారు. అభివృద్ధి అంటే ఒకరిద్దరికి లాభం చేయడం కాదన్నారు. గత ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్ల ట్రాన్స్‌కో, జెన్‌కోలకు రూ.81 వేల కోట్ల అప్పులు అయ్యాయన్నారు. గత ఏడాది వరదలు వస్తే భద్రాద్రి ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాల్సి



వచ్చిందన్నారు. భవిష్యత్తులో గోదావరి వద్ద నీటి మట్టం పెరిగితే భద్రాద్రి ఎ÷-లాంటును కాపాడుకోగలమా? అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఆ తప్పిదాలపై క్రిమినల్ చర్యలకు వెనుకాడవద్దని సూచించారు. అందరూ కూడా చట్టం ప్రకారమే నడుచుకోవాలని స్పష్టం చేశారు. మరోవైపు పవర్ కమిషన్ విచారకు సంబంధించి కేసీఆర్ పంపిన లేఖపై పవర్ కమిషన్ చైర్మ సమీక్ష చేపట్టారు. భద్రాద్రి యాదాద్రి

ధర్మల్ పవర్ ఎ÷-లాంట్ అంశాల్లోని కొన్ని ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారన్న కమిషన్ కేసీఆర్ చెప్పిన విషయాలను నిపుణుల కమిటీతో చర్చిస్తారు. వాస్తవాలపై ప్రతినిధులని కూడా వివరాలు అడుగనున్న కమిషన్ నేడు చర్చ అనంతరం దాని అనుగుణంగానే తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

ఈ కమిషన్ తీరుపై కేసీఆర్ ఆగ్రహంగా ఉన్నారు. విచారణ అర్హత లేదంటున్నారు. అయితే జస్టిస్ నరసింహారెడ్డి మాత్రం ఎవరి అభిప్రాయాలు వారు చెప్పే అవకాశం ఉందన్నారు.

## సాధన ద్వారానే ఏదైనా సాధ్యం !

తిరుపతి,జూన్18 అక్షరం న్యూస్ :

ఈ సృష్టిలో భగవంతుడు మనిషికిచ్చిన గొప్పవరం జ్ఞాపకశక్తి. దాన్ని పదునుపెట్టి అభ్యాసాన్ని, సాధనను జోడిస్తే మానవుడి ప్రతిభ ఖండాంతరాలకు వ్యాపిస్తుంది. అంతులేని సాధన తపస్సుగా మారి మనిషి జీవితాన్ని మహిమాన్వితం చేస్తుంది. అందుకే సాధనమున పనులు సమకూరు ధరలోన..అని ఆర్యోక్తి. గారడివాడు తాడుపై కర్ర పట్టుకుని నేర్పరితనం కనబరుస్తూ నడుస్తుంటే ఆశ్చర్యపోతాం. పిన్నవారైన బాలకులు వామనుడిలా వేదాధ్యయనం చేస్తుంటే వారి జ్ఞాపకశక్తికి ముచ్చటపడి ఆనందిస్తాం. గాయకులు, నృత్య కళాకారులు అద్భుతమైన గాన, నృత్యరీతులు ప్రదర్శిస్తుంటే హర్షధ్వానాలు ప్రకటిస్తాం. శిల్పి కమనీయంగా చెక్కిన శిల్పకళా మూర్తులను చూసి సంతోషాన్ని వెలిబుచ్చుతాం. సభలో పృచ్ఛకులు తామర తంపరగా కురిపించే ప్రశ్నలకు అలవోకగా అందరూ మెచ్చుకునేలా అవధాని సమాధానాలిస్తుంటే 'ఔరా!' అని ముక్కున వేలేసుకుని ప్రశంసిస్తాం.ఇవన్నీ ఎలా సంభవించాయని ఆలోచిస్తే- నిరంతర సాధన, అపూర్వమైన అభ్యాసం, అంతులేని ప్రయత్నం మన కళ్లముందు కనిపిస్తాయి. క్రీడాకారులు కావచ్చు..చదువుకునే వారు కావచ్చు సాధనతోనే ముందుకు సాగుతారు. సాధనమున పనులు సమకూరు ధరలోన అని శతకకారుడు అంటాడు. ఇవాళ జావెలిన్ త్రోలో తన రికార్డును తాను బద్దలు కొట్టిన నీరబ్ చోప్రా తన సాధనతోనే ఆ పనిచేయగలిగాడు. మాలావత్ పూర్ణ కూడా చిన్నతనంలోనే పర్వాతరోమణలో ఎన్నో విషయాలు సాధించి రికార్డులను సొంతం చేసుకుంది. హంపి, పివి సింధు కావచ్చు.. ఇలా ప్రతి ఒక్కరూ తమ రంగాల్లో పట్టుదలతో నిరంతర సాధన ద్వారానే విజయాలు అందున్నారు. అది ప్రతి ఒక్కరికీ అవసరమని గుర్తించాలి. అందుకే మన విద్యావిధానం పూర్వ పూర్తిగా సాధన ద్వారానే ఆధారపడి ఉండేది.

## యాదాద్రిలో గిరి ప్రదక్షిణం

**విప్ బీర్ల అయిలయ్య సమక్షంలో భక్తుల ప్రదక్షిణం**



యాదగిరిగుట్ట,జూన్18 అక్షరం న్యూస్ :

పంచనారసింహ క్షేత్రంమైన యాదగిరి గుట్టలో మంగళవారం సామూహిక గిరి ప్రదక్షిణం ప్రారంభమైంది. అరుణాచలం, సింహాచలం తరహాలో ఇక్కడ ఇకపై సామూహిక గిరి ప్రదక్షిణను నిర్వహించనున్నారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున చేపట్టిన ఈ సామూహిక గిరిప్రదక్షిణలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో పాటు దాదాపుగా 5 వేల మంది భక్తులు గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం కాలినడకన కొండపైకి చేరుకుని గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు ఆలయ ఆఫీసర్లు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఉదయం 5:45 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద ఆలయ ఈవో భాస్కర్ రావుతో కలిసి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు చేసి సామూహిక గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులతో కలిసి కొండ చుట్టూ దాదాపుగా రెండున్నర కిలోమీటర్లు గిరిప్రదక్షిణ చేసి తిరిగి వైకుంఠ ద్వారం వద్ద ముగించారు. అనంతరం స్వామివారి పాదాల చెంత కొబ్బరికాయలు కొట్టి.. కొండపైకి వెళ్లి నారసింహుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సామూహిక గిరిప్రదక్షిణలోఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, అన్ని విభాగాల ఆలయ ఆఫీసర్లు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానిక భక్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా సామూహిక గిరిప్రదక్షిణ కోసం.. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేసి లైటింగ్ సదుపాయం కల్పించారు. గిరిప్రదక్షిణ మార్గానికి మరమ్మత్తులు చేసి భక్తులు ఈజీగా నడిచే విధంగా గిరిప్రదక్షిణ మార్గాన్ని రెడీ చేశారు.

## సిఎంతో కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ సంస్థ సిఇవో భేటీ

హైదరాబాద్,జూన్18 అక్షరం న్యూస్ :

సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ సంస్థ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ భౌ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు, అవకాశాలపై చర్చించినట్లు సమాచారం,. తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల ప్రోత్సాహానికి పెద్దపీట వేస్తున్నదని చెప్పారు. ఈ భేటీలో మంత్రి శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కెసిఆర్, రేవంత్, బండిలపై పెండింగ్ కేసులు

**ఉపసంహరించుకోవాలన్న ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్**

హైదరాబాద్,జూన్18 అక్షరం న్యూస్ :)

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ లపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి వినతి వచ్చింది. కేసీఆర్, బండి సంజయ్‌లతో పాటు రేవంత్ రెడ్డిపై సైతం నమోదైన చిన్న చిన్న కేసులను ఉపసంహరించుకోవాలని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలంగాణ సీఎంకు లేఖ రాసింది. వీటిలో 2011 మిలియన్ మార్చిలో బీఆర్ఎస్ అధినేతపై నమోదైన కేసు ఉంది. 2009లో ఆయన చేసిన ఆమరణ నిరాహార దీక్ష సమయంలో కేసీఆర్ పై పోలీసులు నమోదు చేసిన కేసు ఇంకా పెండింగ్ లో ఉందని లేఖలో ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలోకి ప్రవేశించడంపై ఓ కేసు నమోదైంది. దాంతో పాటు బండి సంజయ్ పై నమోదైన మొత్తం 42 కేసులు కొట్టివేయాలని రిక్వెస్ట్ చేశారు. పోలీసులు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తు న్నారంటూ చేసిన కీలక ఆరోపణలపై రేవంత్ రెడ్డిపై గతంలో కేసు నమోదైంది. దాంతో పాటు కరోనా వ్యాప్తి సమయంలో కోవిడ్ ప్రోటోకాల్ ఉల్లంఘించినందుకు బండి సంజయ్ తో పాటు, రేవంత్ రెడ్డిపై నమోదైన కేసులు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయి.

# కొత్త సారథి వేటలో బిజెపి

- తెరపైకి పులువురు నేతల పేర్లు
- అసెంబ్లీ, పార్లమెంట్ గెలుపుతో సమర్థనేత కోసం చూపు



హైదరాబాద్,జూన్18( ( అక్షరం న్యూస్ :

తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడంతో బిజెపిలో ఉత్సాహం కనిపిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో మరింతగా విస్తరించాలని చూస్తోంది. పార్టీని బలంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు నాయకులను అన్వేషిస్తోంది. పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కేంద్రమంత్రిగా మరోమారు ప్రమాణం చేయడంతో ఆయన స్థానంలో మరొకరిని నియమించేం దుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా త్వరలోనే అధ్యక్ష పదవికి అభ్యర్థి ఎంపిక జరుగనుందని ప్రచారం సాగుతోంది. బిజెపి ప్రతి ఎన్నికల్లో ఓట్ల శాతంతో పాటు సీట్లను పెంచుకుంటూ రాష్ట్రంలో క్రమంగా బలపడుతోంది. రాష్ట్రంలో ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి, కేంద్ర కేబినెట్‌లోకి వెళ్లారు.

దీంతో రాష్ట్ర పార్టీకి కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాల్సి ఉంది. తెలంగాణ బీజేపీ శ్రేణులను నడిపించబోయే కొత్త సారథి ఎవరు? రేసులో ఉన్న నేతల్లో ఎవరికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి? 2028లో తెలంగాణలో అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీ.. దానిని సాధించే సత్తా ఉన్న సారథి కోసం వెదుకుతోంది. తెలంగాణలో కమల రథాన్ని ముందుకు దూకించి, అధికార పీఠం దిశగా దూసుకుపోయే సమర్థుల కోసం వేట ప్రారంభించింది. అలాగే బీజేపీ స్టేట్ చీఫ్ పోస్ట్ కోసం నేతల మధ్య పోటీ పెరిగింది. ఈ రేసులో పలువురు నేతలు పోటీ పడుతున్నారు. ప్రస్తుతానికి దక్షిణాదిలో బీజేపీ వేగంగా విస్తరిస్తున్న రాష్ట్రం.. తెలంగాణ. అందుకే ఈ రాష్ట్రంపై కమలం పార్టీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇప్పటివరకూ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి.. కేంద్ర మంత్రివర్గంలోకి వెళ్లిపోవడంతో.. కొత్త అధ్యక్షుడి నియామకంతో పాటు బూత్ స్థాయిలో సంస్థాగత మార్పులకు బీజేపీ సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడి రేసులో అధిష్ఠానం ముందు కొన్ని పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఈటల రాజేందర్, డీకే అరుణ రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్, రామచందర్ రావులు సహా పలువురు నేతలు రేసులో ఉన్నారు. వీళ్లలో ఎవరికి పగ్గాలు అప్పగిస్తే బాగుంటుందా అనే ఆలోచనలో కమలం పార్టీ ఉంది . మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌కు తెలంగాణ బీజేపీ పగ్గాలు దక్కడం ఖాయమని జోరుగా ప్రచారం సాగింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్, హుజూరాబాద్‌లో పోటీ చేసి పరాజయం పాలైన ఈటలకు మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా పార్టీ మరో అవకాశం ఇచ్చింది. ఎంపీగా గెలిచి ఢిల్లీ వెళ్లిన ఈటల.. కేంద్ర మంత్రి పదవి సైతం ఆశించారు. కానీ అది దక్కలేదు. అయితే ఈటలకు రాష్ట్ర పార్టీ బాధ్యతలు అప్పగించబోతున్నారని కొందరు చెప్పుకుంటోంది. ఈటలకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే.. లోకల్ బాడీ ఎన్నికలు, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటొచ్చని బీజేపీ అధిష్ఠానం భావిస్తోందని కూడా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఆ దిశగా పార్టీ అధిష్ఠానం సంకేతాలు ఇచ్చినట్లు ఈటల వర్గీయులు చెబుతున్నారు. ఇక కేంద్ర మంత్రివర్గంలో స్థానం ఆశించిన పాలమూరు ఎంపీ డీకే అరుణకు రాష్ట్ర బాధ్యతలు అప్పగిస్తే ఎలా ఉంటుందనే దానిపై అధిష్ఠానం సమాలోచనలు చేస్తున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న డీకే అరుణ.. ప్రస్తుతం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. పైగా రేవంత్ ఇలాకాలో ఎంపీగా గెలిచి తన సత్తా ఏంటో చాటి చెప్పారు. దీంతో ఆమె పేరును పార్టీ పరిశీలిస్తోంది. పైగా ఉత్తర తెలంగాణ నుంచి బండి సంజయ్‌కు, హైదరాబాద్ నుంచి కిషన్ రెడ్డికి కేంద్ర మంత్రి వర్గంలో ఛాన్స్ ఇచ్చారు. ఇప్పుడు డీకే అరుణకు అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందనేది పార్టీ ఆలోచనగా తెలుస్తోంది. సీఎం రేవంత్ రాజకీయాన్ని తట్టుకుని రాష్ట్రంలో బీజేపీని ముందుకు తీసుకువెళ్లాలంటే డీకే అరుణెళి కరెక్ట్ అనే ఆలోచనలో ఉందట పార్టీ అధిష్టానం. ఇక మెదక్ ఎంపీగా గెలిచిన రఘునందన్‌రావు.. రాష్ట్ర పార్టీ పగ్గాలు దక్కించుకోవాలని భావిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం, మాజీ సీఎం కేసీఆర్ సొంత ఇలాకాలో విజయం సాధించడం.. రఘునందన్‌కు కలిసి వచ్చే అంశాలు. మంచి వాగ్దాటి కలిగి ఉండడం, ప్రత్యర్థి పార్టీల విమర్శలను తిప్పికొట్టడంలో తనకు తానే సాటి, తనతో తనకే పోటీ. ఇదే ఇప్పుడు అధిష్ఠానం మదిలో ఆయనను పడేలా చేసింది. పార్టీ అధ్యక్ష రేసులో రఘునందన్ పేరును కూడా అధిష్టానం పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఇక నిజామాబాద్ నుంచి వరుసగా రెండోసారి గెలిచిన ఎంపీ ధర్మపురి అరవింద్ కూడా కేంద్ర మంత్రి వర్గంలో స్థానం ఆశించి భంగపడ్డారు. ఇప్పుడు రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతల కోసం తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ట. బీజేపీ చీఫ్ సీటు బీసీలకు ఇచ్చే అవకాశం

ఉండడంతో అరవింద్ వర్గం బోలెడు ఆశలు పెట్టుకుంది. వీళ్లతో పాటు కామారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న వెంకటరమణారెడ్డి సైతం అధ్యక్ష రేసులో ఉన్నారు. అయితే ఇప్పటికే బీజేఎల్పీ బాధ్యతలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మహేశ్వర్‌రెడ్డికి ఇచ్చిన నేపథ్యంలో పార్టీ పగ్గాలు బీసీకి ఇచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయంటున్నారు. అయితే మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్‌కు మంత్రి వర్గంలో అవకాశం ఇచ్చిన నేపథ్యంలో అదే సామాజిక వర్గానికి చెందిన అరవింద్‌కు కొత్త బాధ్యతలు ఇస్తారా లేదా అన్నది ఆసక్తి కరంగా మారింది. తెర వెనుక మరికొంత మంది నేతలు కూడా ప్రయత్నాలు చేస్తున్నారట. పార్టీలో చాలాకాలంగా పనిచేస్తున్న మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, చింతల రాంచంద్రారెడ్డి, పేరాల చంద్రశేఖర్, ఆచారి పేర్లు సైతం వినపడుతున్నాయి. వీళ్లలో అధిష్ఠానం ఎవరివైపు మొగ్గుచూపుతుందనేది ఆసక్తిగా మారింది. ఏది ఏమైనా జాతీయ అధ్యక్షుడి నియామకం తర్వాతే పదవులు భర్తీ చేసే అవకాశం ఉంది.

# ఇక పకడ్బందీగా రేషన్ పంపిణీ

**బియ్యంతో పాటు పప్పులు,ఉప్పులు**

**పరిశీలన చేస్తున్న కూటమి ప్రభుత్వం**



అమరావతి,జూన్18( అక్షరం న్యూస్ :

తెలుగుదేశం నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చే రేషన్‌ను ఇక మరింత పకడ్బందీగా చేయాలని ఆలోచిస్తోంది. అధికారంలోకి వచ్చి రాగానే తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏడాది నుంచి కందిపప్పు పంపిణీని నిలిపివేసింది. ఈ విషయం తెలుసుకున్న చంద్రబాబు ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి కందిపప్పుతో పాటు పంచదార సరఫరా చేయాలని భావిస్తోంది. కందిపప్పును వైసీపీ ప్రభుత్వం నిలిపివేయడంతో సామాన్యులు ఏడాది నుంచి బహిరంగ మార్కెట్లలో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. తమ ప్రభుత్వం పేదలు, లబ్ధిదారులతో పాటు అన్ని వర్గాల వారికి సంక్షేమంతో పాటు అభివృద్ధిపై దృష్టి పెట్టనుందని చంద్రబాబు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ క్రమంలో రేషన్ షాపుల ద్వారా కందిపప్పు ఇవ్వడం లేదని ఆరోపణలు వచ్చాయి. మార్కెట్‌లో దరలు పెరిగినందను పేదలకు అందుబాటులో నిత్యావసరాలు తీసుకుని వచ్చే క్రమంలో మరిన్ని సరుకులు అందించే ఆలోచన చేస్తున్నారు. ఇందుకు డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. సత్వరమే సరఫరా మొదలుపెట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ అధికారులు కదిలారు. కందిపప్పును కొనుగోలు చేసి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు తరలిస్తున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లు, పంచదారను రేషన్ షాపులకు సరఫరా చేయాల్సి ఉంది. జులై 1వ తేదీ నుంచి తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతో పాటు కందిపప్పు, పంచదారను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ లోకి వచ్చిన కందిపప్పు, చక్కెరతో పాటు అక్కడి సరుకుల నాణ్యతను అధికారులు పరిశీలిస్తున్నారు. పీ ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాదెండ్ల మనోహర్ రెండు రోజుల కిందట తెనాలిలో తనిఖీలు చేపట్టారు. అంగన్‌వాడీలకు ఇచ్చే కందిపప్పు, నూనెతో పాటు వైట్ రేషన్ కార్డుదారులకు ఇచ్చే పంచదారలో ఎక్కడ చూసిన తక్కువ తూకంతో సరుకులు పంపిణీ జరుగుతోందని గుర్తించారు. కందిపప్పు, నూనె అయితే 50 నుంచి 100 గ్రాములు తక్కువ ఉందని నిల్వ గోదాములను తనిఖీ చేసినప్పుడు వెల్లడైంది. అనంతరం మంగళగిరిలోనూ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీలు చేయించారు. అక్కడ సైతం నిర్దేశిత పరిమాణం కంటే తక్కువ తూకంతో పంపిణీ జరుగుతున్నట్లు తేలింది. ఈ క్రమంలో ఏపీ వ్యాప్తంగా కందిపప్పు, పంచదార, నూనె ప్యాకెట్ల పంపిణీ నిలిపేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించడం తెలిసిందే. ఈ అవకతవకలు జరగడానికి కారణాలపై రెండు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈ నెల రేషన్ లో సరుకుల జాబితాను సిద్ధం చేయబోతున్నారు.

## తప్పు చేసిన పోలీసులకు శిక్ష తప్పదు

**బిజెపి కార్యకర్తలకు రఘునందన్ పరామర్శ**

మెదక్,జూన్18(( అక్షరం న్యూస్ :

బీఆర్‌ఎస్ నేతల మాటలు విని ఫోన్ ట్యాపింగ్‌లో పట్టుబడ్డ కొందరు పోలీసులు జైల్లో ఉన్నారని .. తప్పుడు పనులు చేసిన పోలీసులను కూడా అక్కడికే పంపుతామని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడ్డ వారు శిక్ష అనుభవించక తప్పదన్నారు. మెదక్‌లో ఇటీవల జరిగిన అల్లర్లలో అరెస్టై మెదక్ సబ్ జైల్లో ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను రఘునందన్ రావు పరామర్శించారు. రెండు రోజుల క్రితం జరిగిన మెదక్ ఘటనలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని తెలంగాణ డీజీపీ రవికుమార్ గుప్తాను డిమాండ్ చేశారు. ఐజీ రంగనాథ్ అత్యుత్సాహం చూపుతున్నారని వార్నింగ్ ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఏ గతి పట్టిందో మెదక్ పోలీసులకు అదే గతి పడుతుందని.. తాను ఎవరికి బయపడనని హెచ్చరించారు. హిందువులకు ఓ నీతి ..ముస్లింలకు ఓ నీతిలా పోలీసులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మహిళ ఏఎస్ఐను బూతులు తిట్టిన వారిపై కూడా ఏం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రెండు రోజులు తాను సంయమనం పాటించానని చెప్పారు. అరిఫ్ గాయపడి ఏ హాస్పిటల్లో ఉన్నారని ప్రశ్నించారు. అరిఫ్‌ను వెంటనే అరెస్టు చేయాలని.. చట్టాన్ని సమర్థంగా పనిచేయించాలని రఘునందన్ రావు కోరారు.

## యాదాద్రిలో తిరిగి గిరిప్రదక్షిణ

**ఆలోచనచేస్తున్న ఆలయ అధికారులు**



యాదగిరిగుట్ట,జూన్18( అక్షరం న్యూస్ :

యాదగిరి గుట్టలో గిరి ప్రదక్షిణకు ఉన్న డిమాండ్‌తో మళ్లీ దానిని ప్రవేశ పెట్టే ఆలోచనలో ఆలయ అధికారులు ఉన్నారు. ఈ దివ్యక్షేత్రాన్ని దేశంలోని ఇతర దివ్యక్షేత్రాల్లోని మరే ఆలయానికీ తీసిపోని రీతిలో వివిధ శిల్పకళా శైలుల వైభవం ఒకేచోట భక్తులకు కనువిందు చేసేలా అత్యంత అపురూపంగా పునర్నిర్మించారు. ఆలయ ఆలయ పునర్ నిర్మాణంతో గిరి ప్రదక్షణ చేసేందుకు భక్తులకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడగానే యాదగిరిగుట్టలో ఉన్న పాత ఆచారాలను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకుంది. గిరి ప్రదక్షిణ అనగానే మనకు గుర్తుకువచ్చేది 14 కిలోమీటర్ల అరుణాచల గిరిప్రదక్షిణ. మహిమాన్విత స్వయంభు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని భక్తులు గిరిప్రదక్షిణ చేసుకొని స్వామివారిని దర్శించుకోవడం ఏళ్లుగా సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ యాదాద్రి గిరి ప్రదక్షణకు కూడా అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. యాదగిరిగుట్ట కొండపై జ్వాలా నారసింహుడు, గండభేరుండ నారసింహుడు, యోగ నారసింహుడు, ఉగ్ర నరసింహుడు, లక్ష్మీ నరసింహుడు స్వయంభువులుగా వెలసిన పంచ నారసింహ క్షేత్రంగా ఎంతో ప్రసిద్ధి. ఎన్నో ఏళ్లుగా స్థానిక భక్తులు మాత్రమే గిరిప్రదక్షిణ చేసుకొని స్వామివారిని దర్శించుకోవడం జరుగుతోంది. అయితే 2016లో కోట్లాది రూపాయలతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఇందులో బాగానే కొండపై స్వామివారి సన్నిధిలో భక్తులకు బస చేసే అవకాశం, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకోవడం, కొండపైకి ఆటోలను అనుమతించడం వంటి అంశాలను పునరుద్ధరించింది.

## తిరుమలల పవిత్రతో పాటు ఆధ్యాత్మికత

**మళ్లీ పాతపద్ధతిలో సమూల మార్పులకు కసరత్తు**



తిరుమల,జూన్18( అక్షరం న్యూస్ :

కేవలం వ్యాపారసూత్రంతో గత ఐదేళ్లుగా సాగిన తిరుమ వ్యవహారాలను ఇక పూర్తి ఆధ్యాత్మికత కొనసాగించేందుకు కసరత్తు మొదలయ్యింది. ఇవో నియామకంతో మెల్లగా అటువైపు సిఎం చంద్రబాబు దృష్టి సారించారు. టీటీడీ.. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇక నుంచి కొండపై వసతులు, దర్శనం అన్నీ ఆధ్యాత్మికతను జోడించేలా ఉండబోతున్నాని తెలుస్తోంది. అవకాశం ఉన్న చోట మార్పులు చేపట్టి, శ్రీవారి దర్శనం భక్తుడికి జీవితాంతం గుర్తుండిపోయేలా చేయాలని టీడీపీ భావిస్తోంది. కొత్త ఈవో శ్యామల రావు లక్ష్యం ఇదేనని కూడా స్పష్టం అవుతోంది. టీటీడీలో ప్రక్షాళన షురూ అంటున్న ప్రభుత్వం ముందు సమస్యలు, సవాళ్లు ఏంటన్న దానిపై దృష్టి పెట్టింది. గత ప్రభుత్వ హయంలో అమలైన విధానాలను కొనసాగించాలా వద్దా అన్నదానిపై ఫోకస్ పెట్టింది. వీఐపీ బ్రేక్ దర్శనం విషయంలో పాత విధానం అమలుకే మొగ్గ చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బ్రేక్ దర్శనం కొనసాగుతోంది. ఈ విధానంతో శ్రీవారి సర్వదర్శనం చేసుకునే సామాన్య భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న విమర్శలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. దీంతో పాత విధానం మేలని శ్రీవారి నైవేద్య సమయంలోపే విఐపి బ్రేక్ దర్శనాలను ముగించాలని టీటీడీ భావిస్తోంది.మరోవైపు సామాన్య భక్తులు వసతి గదులు పొందేలా చర్యలు చేపట్టాలని ప్రయత్నిస్తోంది. అందుబాటులో ఉన్న 7800 అతిథి గృహాలతో పాటు పిలిగ్రీం ఎమ్యూనిటీ సెంటర్లను అందుబాటులో తీసుకురావాలని ఆలోచిస్తోంది. నడక మార్గంలో దివ్య దర్శనం టోకెన్లు అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచనలో ఉన్న టీటీడీ సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తోంది. అన్న ప్రసాదం, లడ్డూల నాణ్యత, తిరుమలలో పచ్చదనం, పారిశుద్ధ్యం వంటి అంశాలను టాప్ ప్రియారిటీ గా తీసుకుంది.మొదటి రోజు నుంచే ప్రక్షాళన ప్రారంభమైంతా. పవిత్ర పుణ్యక్షేత్రంలో రాజకీయం కుదరదు. తిరుమలలో గోవింద నామస్మరణనే మార్మోగాలి.. ఇవీ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టే ముందు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు సాకారం కాబోతున్నాయి. అందుకు తగ్గట్టుగానే చర్యలు చేపట్టిన ఏపీ ప్రభుత్వం.. టీటీడీ ఈఓ బాధ్యతలను సీనియర్ ఐఏఎస్ అధికారి శ్యామలరావుకు అప్పగించింది. శ్యామలరావు సైతం వెంటనే రంగంలోకి దిగారు. ముందు తిరుమలలో వరాహస్వామికి ప్రత్యేక పూజలు చేసి, ఆ తరువాత శ్రీవారిని దర్శించుకున్నారు. ఈఓగా బాధ్యతలు తీసుకున్న శ్యామల రావు తన ముందున్న లక్ష్యాలు, సవాళ్లను వివరించారు. తిరుమల క్షేత్రం హిందువులకు ఎంతో పవిత్రమైనది, ఇలాంటి క్షేత్రానికి ఈఓగా రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు స్పష్టం చేశారు. తిరుమల యాత్ర భక్తులకు జీవితాంతం గుర్తుండి పోయేలా చేస్తామన్న ఈఓ.. ప్రతీ విషయం పారదర్శకంగా, బాధ్యతాయుతంగా ఉండేలా చూస్తామంటున్నారు. ఈఓగా బాధ్యతలు తీసుకున్న మరుక్షణమే తిరుమలలో తనిఖీలు చేపట్టారు. సమూల మార్పులు లక్ష్యంగా రంగంలోకి దిగిన ఈఓ సర్వదర్శనం క్యూలైన్లను పరిశీలించారు. నందకం గెస్ట్ హౌస్ నుంచి శిలాతోరణం ద్వారా నారాయణగిరి షెడ్ల వరకు నడిచి వెళ్తూ భక్తులతో మాట్లాడారు. భక్తుల సౌకర్యాలపై ఆరా తీశారు. పారిశుద్ధ్యం పట్ల అసహనం వ్యక్తం చేసిన ఈఓ ఇద్దరు శానిటరీ ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. తాగునీరు పరిశుభ్రంగా లేకపోవడంపైన అసంతృప్తి వ్యక్తం చేశారు.

# శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

• తనిఖీలు చేపట్టిన భద్రతా సిబ్బంది



హైదరాబాద్,జూన్18( అక్షరం న్యూస్ :

: శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. గుర్తుతెలియని అగంతకుడు ఎయిర్ పోర్ట్ మెయిల్‌కు బాంబు ఉందని లేఖ పంపాడు. అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎయిర్ పోర్ట్ అధికారి ఒకరు మాట్లాడుతూ.. 'శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఇంటెలిజెన్స్ అధికారులకు ఓ అగంతకుడు బాంబు పెట్టామంటూ మెయిల్ చేశాడు. అది చూసిన అధికారులు భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు. క్షుణ్ణంగా తనిఖీలు చేసిన సిబ్బంది అది ఆగతాయి పనిగా తేల్చారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టాం' అని తెలిపారు. ఒక్కసారిగా సిబ్బంది తనిఖీలు చేయడంతో ప్రయాణికులు హడలిపోయారు.

# ఛత్తీస్‌ఘడ్ విద్యుత్ ఒప్పందంతో 2,600 కోట్ల నష్టం

• విద్యుత్ శాఖ మాజీ అధికారి రఘు వెల్లడి
• జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు పవర్ పాయింట్ ప్రజంటేషన్

హైదరాబాద్,జూన్18 అక్షరం న్యూస్ :

చత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందాల వల్ల 2,600 కోట్ల రూపాయల నష్టం జరిగిందని విద్యుత్ శాఖ మాజీ అధికారి రఘు తెలిపారు. మంగళవారం జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ఎదుట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినట్టు చెప్పారు. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ కేంద్రాలపై తమ వద్ద ఉన్న సమచారాన్ని కూడా అందించామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌తో తొలుత వెయ్యి మెగావాట్ల సరఫరాకు ఒప్పందం జరిగితే అది సప్లయ్ కాలేదని, తర్వాత తెలుసుకొని మరో వెయ్యి మెగావాట్లకు ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. తరువాత తెలుసుకొని రద్దు చేసుకోవాలని ప్రయత్నిస్తే కుదరలేదన్నారు. చత్తస్ గఢ్ ఒప్పందం రెగ్యులెటరీ కమిషన్ ఒప్పదం పొందలేదని చెప్పారు. ఇరు రాష్ట్రాల డిస్కంలు మాత్రమే ఎంవోయూ చేసుకున్నాయని చెప్పారు. బీహెచ్‌ఈఎల్ కాంపిటేటివ్ బిడ్డింగ్ లో 2013-2014 88శాతం ఉంటే తర్వాత జీరోకు పడిపోయిందని చెప్పారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన యాదాద్రి ప్లాంట్ తొమ్మిదేండ్లయినా పూర్తి కాలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై బీహెచ్‌ఈఎల్ సబ్ క్రిటికల్ టెక్నాలజీని రుద్దిందని చెప్పారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ కోసం వాడిన యంత్రాలు సరైనవి కావదని అన్నారు. గోదావరిలో ఫ్లడ్ ఎక్కువైతే పవర్ ఎ÷-లాంట్ పై ప్రభావం పడుతుందని చెప్పారు. సాంకేతిక పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా భద్రాద్రి పవర్ ఎ÷-లాంట్ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. యాదాద్రి పవర్ ఎ÷-లాంట్ వల్ల రవాణా చార్జీల భారం పడుతుందని చెప్పారు. ఈ విషయాలన్నీ కమిషన్ కు వివరించినట్టు చెప్పారు.

# విశాఖ స్టీల్‌పై ప్రజాభీష్టంమేరకు నడుచుకుంటాం

• బాధ్యతలు స్వీకరించిన కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ



న్యూఢిల్లీ,జూన్18( అక్షరం న్యూస్ :

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రిగా భూపతిరాజు శ్రీనివాస వర్మ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను ఈ స్థాయికి రావడానికి జాతీయ, రాష్ట్ర నేతలు చాలా మంది సహకరించారని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కాకుండా బాధ్యతలు నిర్వర్తిస్తామన్నారు. ఏపీలో కీలకమైన అంశాలలో వైజాగ్ స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణ ఒకటి. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే శ్రీనివాస వర్మ వైజాగ్ స్టీల్ ఎ÷-లాంట్ పై స్పందించారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా స్టీల్ ఎ÷-లాంట్ విషయంలో ముందు కెళ్తామన్నారు. విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం విధాన పరంగా నిర్ణయం తీసుకుంటుం దన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలు ఎన్డీయే కూటమిలా అధికారంలోకి వచ్చాం. అందుకే ఈ పార్టీల అధినేతలతో సమావేశం అనంతరం విశాఖ ఉక్కుపై వివరాలు ప్రకటిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఏపీ నుంచి పలు కారణాలతో వెనక్కు వెళ్లిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకుని వస్తామన్నారు. ఆసక్తి చూపిన పరిశ్రమలకు భూములు కేటాయించి, ఉపాధి అవకాశాలు పెంచుతామని స్పష్టం చేశారు. తాను రెండు శాఖలకు మంత్రి అని, మోదీ నాయకత్వంలో పనిచేసి ఈ రెండు శాఖలకు మంచి పేరు తెస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలసీలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుని పారిశ్రామిక వేత్తల్ని ప్రోత్సాహిస్తాం అన్నారు. ప్రధానమంత్రి మోదీ ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధిలో మరో అడుగు ముందుకేస్తామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల సహకారంతో నరసాపురం పార్లమెంట్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. తాను 35 ఏళ్లుగా పార్టీలో ఉండి, అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర మంత్రి స్థాయికి రావడంలో తోడ్పాటు అందించిన నేతలకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, కింజరాపు రామ్మోహన్, నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ లతో పాటు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, సీఎం రమేష్ లతో పాటు ఏపీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో చర్చించి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తామన్నారు.

# జూలై 29 నుండి సుప్రీంకోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్

న్యూఢిల్లీ,జూన్18( అక్షరం న్యూస్ :

సుప్రీంకోర్టులో జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించనున్నారు. సుప్రీంకోర్టు స్థాపించిన 75వ సంవత్సరంలో ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తోంది. ఈ సమయంలో ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన కేసులను త్వరితగతిన విచారించనున్నారు. సామాన్య ప్రజలు ఈ లోక్ అదాలత్ ద్వారా ప్రయోజనం పొందనున్నారు. స్థాపన జరిగిన 75వ సంవత్సరంలో.. తగిన పెండింగ్‌లో ఉన్న కేసుల సామరస్య పరిష్కారాన్ని కనుగొనడానికి సుప్రీంకోర్టు 2024 జూలై 29 నుండి 2024 ఆగస్టు 3 వరకు ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేస్తుంది. దేశ రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చింది. అదే తేదీ నుండి సుప్రీంకోర్టు ఉనికిలోకి వచ్చింది."లోక్ అదాలత్‌లు ఈ దేశ న్యాయవ్యవస్థలో అంతర్భాగంగా ఉన్నాయి. ఇవి వివాదాల ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని త్వరితగతిన, సామరస్యపూర్వక పరిష్కారాన్ని ప్రోత్సహించే సాధనంగా ప్రోత్సహిస్తుంది" అని అత్యున్నత న్యాయస్థానం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.రాబోయే లోక్ అదాలత్ నిర్వహణ.. సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో, సమర్థవంతమైన న్యాయాన్ని అందించడానికి దాని నిబద్ధతకు అనుగుణంగా ఉందని సుప్రీంకోర్టు ప్రకటన పేర్కొంది. లోక్ అదాలత్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను విచారిస్తుంది. తద్వారా వాటి సత్వర పరిష్కారానికి హామీ ఇస్తుంది. వివాహ మరియు ఆస్తి వివాదాలు, మోటారు ప్రమాద క్లెయిమ్‌లు, భూసేకరణ, పరిహారం, సేవ మరియు కార్మిక సంబంధిత కేసులపై విచారించనుంది.

# పవిత్ర గౌడకి తీవ్ర అస్వస్థత..

**హుటాహుటిన హాస్పిటల్ కి తరలింపు!**

బెంగళూరు,జూన్18 అక్షరం న్యూస్ :)

: రేణుకా స్వామి హత్య కేసులో అరెస్టయిన నటుడు దర్శన్ ప్రియురాలు పవిత్ర గౌడ తీవ్ర అస్వస్థతకు గురై బెంగళూరులోని ఆసుపత్రిలో చేరారు. హత్య కేసులో ఏ1గా ఉన్న పవిత్ర గౌడ వారం రోజులకు పైగా పోలీసుల కస్టడీలో ఉన్నారు. ప్రతిరోజూ ఉదయం పోలీస్ స్టేషన్‌లో విచారణ అనంతరం నిమ్హాన్స్‌లోని మహిళా సౌకర్యాల కేంద్రంలో ఆమెను ఉంచుతున్నారు. ఆదివారం రోజంతా ఆర్‌ఆర్ నగర్ ఇంటి వద్ద పోలీసులు విచారణ నిర్వహించగా, అనంతరం పవిత్ర అలసిపోయింది. ఇక మంగళవారం ఉదయం పవిత్ర గౌడ తనకు బాలేదని చెప్పడంతో చికిత్స నిమిత్తం బెంగళూరులోని ప్రభుత్వాసుపత్రిలో చేరారు.జూన్ 8న రేణుకాస్వామి హత్యకు గురికాగా, జూన్ 10న (సోమవారం) నటుడు దర్శన్, అతని ప్రియురాలు పవిత్ర గౌడను అరెస్టు చేశారు. ఆమె వరుసగా 9 రోజులు పోలీసు కస్టడీలో ఉన్నారు. అన్నపూర్ణేశ్వరి నగర్ లోని పోలీస్ స్టేషన్ సెల్‌లో దర్శన్‌తో పాటు ఇతర నిందితులందరినీ పోలీసులు విచారిస్తున్నారు. మహిళా నిందితురాలు పవిత్రను మాత్రమే మహిళా సాంత్వన కేంద్రంలో ఉంచారు. ఇక మరోపక్క దర్శన్ ఫాంహౌస్ మేనేజర్ శ్రీధర్ (39 ఏళ్లు) ఏప్రిల్ 16న ఆత్మహత్య చేసుకున్నాడు. బెంగళూరులోని అనేకల్ సమీపంలోని దర్శన్ ఫామ్‌హౌస్ పక్కన బండరాళ్ల మధ్య శ్రీధర్ మృతదేహం లభ్యమైంది. శ్రీధర్ విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసు ఇంకా విచారణలో ఉంది.

# అమెరికాలో దారుణ ఘటన

• న్యూజెర్సీలో దుండగుడు కాల్పులు
• పంజాబ్ మహిళ మృతి.. మరొకరికి గాయాలు

న్యూజెర్సీ,జూన్18 అక్షరం న్యూస్ :

అమెరికాలో దారుణం జరిగింది. న్యూజెర్సీలో భారత సంతతికి చెందిన మహిళలపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఓ మహిళ మరణించగా, ఆమె సోదరికి తీవ్ర గాయాల య్యాయి. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటోంది. రెండురోజుల కిందట జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అసలేం జరిగిందంటే.. అమెరికా న్యూజెర్సీలోని మిడిల్ సెక్స్ కౌంటీలో బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. పంజాబ్‌కు చెందిన ఇద్దరు మహిళలు జస్వీర్‌కౌర్, ఆమె సోదరి గగన్‌దీప్ కౌర్ రోడ్డు పక్కన నడుస్తున్నారు. ఆ సమయంలో ఓ వ్యక్తి వీరిపై కాల్పులు జరిపి పారిపోయాడు. జస్వీర్‌కౌర్ స్పాట్‌లో మరణించగా, గగన్‌దీప్ కౌర్ తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులను ఆంబులెన్స్ సాయంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే జస్వీర్ కౌర్ మరణించగా, ఆమె సోదరి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. ఇక్కడ మరో ట్విస్ట్ ఏంటంటే.. కాల్పులు జరిగిన వ్యక్తి గౌరవ్ కౌర్ కూడా భారతీయుడే. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడ్ని వాషింగ్టన్‌లో తన ఇంటి వద్దే అరెస్ట్ చేశారు. ఇదిలావుండగా బాధిత మహిళలు ఇద్దరు నిందితుడికి గతంలో పరిచయం ఉంది. పంజాబ్‌లో గగన్‌దీప్ కౌర్, తాను కలిసి చదువుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడించాడు. అయితే కాల్పులు జరపడానికి కారణాలు తెలియాల్సివుంది. అమెరికాలో పంజాబ్ మహిళను భారతీయుడే చంపడం ఇదే తొలిసారి. గతంలో ఆ తరహా ఘటనలు లేవని అంటున్నారు. జస్వీర్‌కౌర్ న్యూజెర్సీలోని అమెజాన్‌లో జాబ్ చేస్తోంది. ఆమె భర్త ట్రక్కు డ్రైవర్. ఐదేళ్ల కిందట భర్తతో కలిసి అమెరికా వెళ్లిందామె. ఆమె సోదరి గగన్‌దీప్ స్టూడెంట్ వీసా మీద అక్కడికి వెళ్లింది.

# భార్య మృతి తట్టుకోలేక ఐపీఎస్ ఆత్మహత్య

అస్సాం,జూన్18(( అక్షరం న్యూస్ :

భార్య చనిపోవడంతో భర్త, ఐపీఎస్ అధికారి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని అస్సాం డీజీపీ జీపీ సింగ్ స్వయంగా ఎక్స్‌లో పోస్ట్ చేయడం ద్వారా ధృవీకరించారు. ఆయన తన పోస్ట్‌లో.. 'ఇది దురదృష్టకర సంఘటన. అస్సాం హోం, పొలిటికల్ సెక్రటరీ శిలాదిత్య చెటియా ఈరోజు సాయంత్రం ప్రాణాలు తీసుకున్నారు. అతను 2009 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. చాలా కాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న తన భార్య మరణించిన నిమిషాల తర్వాత అతను ఈ చర్య తీసుకున్నాడు. ఈరోజు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు" అని తెలిపారు. ఈ ఘటనతో ఆ పోలీసు కుటుంబం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది.మరోవైపు.. జార?ండ్‌లోని బొకారో జిల్లాలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) సిబ్బంది తన భార్య గొంతు కోసి తాను ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మంగళవారం పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని సెక్టార్-8లో ఉన్న ఆయన అధికారిక నివాసంలో సోమవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ఆ దంపతులు పశ్చిమ బెంగాల్‌లోని పురూలియా జిల్లాకు చెందినవారు. కాగా.. భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, ఆ తర్వాత ఈ ఘటనకు పాల్పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారిద్దరూ 2008లో పెళ్లి చేసుకున్నారు. అదే సమయంలో.. మృతుడు తండ్రి ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో %ాజుజూ% ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అయితే.. తాను ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో.. మూడు నెలల క్రితమే తండ్రి మరణంతో కారుణ్య నియామకం పొందారు. కాగా.. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి చేరుకున్న సిఐఎస్ఎఫ్ నాగరాజు.. ఈ ఘతాకానికి పాల్పడ్డాడు.

# అస్సాంలో వరదల బీభత్సం

**వరదల్లో చిక్కుకున్న పలు జిల్లాలు**

**వరదలకు నిరాశ్రయులైన 6వేల మంది**

అస్సాం,జూన్18( అక్షరం న్యూస్ :

అస్సాంలో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరదల్లో దాదాపు లక్షకు మందికి పైగా ప్రభావితమయ్యారని అస్సాం స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ తెలిపింది. సోమవారం నాటికి ఎనిమిది జిల్లాల్లో బాధితుల సంఖ్య 1.05లక్షలు అని పేర్కొంది. వరదలు, తుఫానుల కారణంగా బక్సా, బార్‌పేట, దర్రాంగ్, ధేమాజీ, గోల్ పరా, కరీంగంజ్, నాగావ్, నల్బరీ జిల్లాల్లో 1,05,700 మందికి పైగా బాధితులు నిర్వాసితులయ్యారు. అత్యధికంగా కరీంగంజ్‌లో 95,300 మంది వరదలకు ప్రభావితులయ్యారని పేర్కొంది. తీవ్రంగా దెబ్బతిన్న ఇతర జిల్లాల్లో చాలామంది నిర్వాసితులయ్యారు. నాగావ్‌లో 5వేల మంది ప్రభావితమయ్యారని, 3,600 మందిపైగా దేమాజీ వరద నీటిలో కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో దాదాపు 6వేల మందికి పైగా వరదల్లో చిక్కుకున్నారు. అలాగే ఈ ఏడాది వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుఫాను కారణంగా మరణించిన వారి సంఖ్య 34కి చేరిందని అస్సాం స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ తెలిపింది. వరదల బీభత్సానికి గురైన ప్రాంతాల్లో సహాయ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో జిల్లాకు సుమారు 11 సహాయక శిబిరాలు చర్యలు చేపట్టాయి. ఈ శిబిరాల్లో 3,168 మంది ఆశ్రయం పొందుతున్నారు. అలాగే ఒక్కో జిల్లాలో మూడు సహాయక పంపిణీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వరద బాధితులకు ఫుడ్ సరఫరా చేస్తున్నారు. ఈ మేరు గత 24 గంటల్లో ఒక్కో శిబిరానికి 21.5 క్వింటాళ్ల బియ్యం 3.81 క్వింటాళ్ల పప్పు, 1.12 క్వింటాళ్ల ఉప్పు, 114 లీటర్ల నూనెను ప్రభుత్వం పంపిణీ చేసింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వరద బీభత్సానికి 309 గ్రామాలు నీటమునిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1,005.7 హెక్టార్లకు పైగా పంటలు దెబ్బతిన్నాయని అస్సాం స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ తెలిపింది. ప్రధానంగా బొంగైగావ్, చిరాంగ్, ధేమాజీ, గోల్‌పరా, హోజాయ్,నాగావ్, తముల్ పూర్, దర్రాంగ్, నల్బరి,





లఖింపూర్, ఉదల్ గురి ప్రాంతాల్లో రోడ్డు, వంతెనలు, ఇతర కమ్యూనికేషన్స్‌లకు అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. దీంతో రవాణా సైతం స్థంభించిపోయిందని ప్రభుత్వం తెలిపింది.

# పలు ఎయిర్‌పోర్టులకు బాంబు బెదిరింపులు

**భద్రత కట్టుదిట్టంచేసిన పోలీసులు**

న్యూఢిల్లీ,జూన్18( అక్షరం న్యూస్ :

దేశంలో మరోసారి బాంబు బెదిరింపు ఈ మెయిల్స్ కలకలం సృష్టించాయి. బీహార్‌లోని పాట్నా విమానాశ్రయ అధికారులకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్‌లు అందడంతో మంగళవారం ఎయిర్ పోర్ట్ పరిసరాల్లో భయాందోళన నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం 1:10 గంటలకు పాట్నా విమానాశ్రయం డైరెక్టర్‌కు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. దీంతో ఎయిర్ పోర్టు అంతటా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పాట్నా ఎయిర్ పోర్ట్ డైరక్టర్ తెలిపారు. కాగా మంగళవారం ఇది రెండో బాంబు బెదిరింపు. అంతకుముందు గుజరాత్‌లోని వడోదరా విమానాశ్రయానికి బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. విమానాశ్రయ అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. పోలీసులను సంప్రదించి విమానాశ్రయ ఆవరణలో భద్రతను పెంచారు. బెదిరింపు ఈమెయిల్‌ను పంపిన వ్యక్తిని ట్రాక్ చేయడానికి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ఇక వడోదర సైబర్ క్రైమ్ బెదిరింపు ఈ-మెయిల్ మూలాన్ని వెతుకుతోంది. మంగళవారం, బూటకపు బాంబు బెదిరింపు చెన్నై నుంచి దుబాయ్ వెళ్లే విమానం ఆలస్యానికి కారణమైంది. ఈ విమానంలో 268 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానంలో బాంబు ఉన్నట్లు బెదిరింపు రావడంతో భద్రతా సంస్థలు విమానాన్ని



క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఇదిలా ఉండగా సోమవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్తున్న విమానానికి మరో బాంబు బెదిరింపు వచ్చింది. జూన్ 17 ఉదయం 9:35 గంటలకు, ఢిల్లీ- దుబాయ్ ఫ్లైట్‌లో బాంబు ఉందని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఆఫీసు ఎయిర్‌పోర్ట్‌కు ఈమెయిల్ వచ్చిందని పోలీసులు తెలిపారు. కోయంబత్తూరు, జైపూర్ ఎయిర్ పోర్టులకు కూడా బాంబు బెదిరింపు ఈమెయిల్స్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఎయిర్ పోర్టు పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు. గత వారం ఢిల్లీలోని పలు మ్యూజియంలకు బాంబు బెదిరింపులు వచ్చాయని పోలీసులు తెలిపారు. కాగా అదంతా ఫేక్ అని తేల్చేసారు అధికారులు. ఢిల్లీలోని రైల్వే మ్యూజియంతోపాటు దాదాపు 10-15 మ్యూజియంలకు ఈమెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# వైద్య శాఖలో ప్రక్షాళన మొదలైంది

- ఒకటి రెండు ఏళ్లలో స్థిరమైన మార్పులు
- ప్రతి 35 కిలోమీటరు కి ఒక ట్రామ సెంటర్
- కొత్తగా 75 ట్రమా కేర్ సెంటర్లు ఏర్పాటు
- ప్రభుత్వ ఆస్పత్రులకు డయగ్నోస్టిక్ సెంటర్ల అనుసంధానం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

హైదరాబాద్,జూన్18 అక్షరం న్యూస్ :

వైద్య శాఖలో ప్రక్షాళన మొదలైందని, ఒకటి రెండు ఏళ్లలో స్థిరమైన మార్పులు కనిపిస్తాయన్నారు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ కిట్ లో మార్పులు.. ప్రతి 35 కిలోమీటరు కి ఒక ట్రామ సెంటర్, కొత్తగా 75 ట్రమా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డయగ్నోస్టిక్ సెంటర్లు ప్రభుత్వ ఆస్పత్రులకు లింక్ చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 3 రకాల టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయబోతున్నామని, ప్రైవేటు ఆస్పత్రుల పర్యవేక్షణ ( క్లినికల్ ఎస్టాబ్లిష్ ) అని ఆయన వ్యాఖ్యానించారు. ఫార్మా మెడికల్ కోసం (డ్రగ్స్ నియంత్రణ ) ఫుడ్ క్వాలిటీ కోసమని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రాంతాల వారీగా సర్వే చేయకుండా అవసరం లేకుండా ఇచ్చారని, మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లు కూడా దొరకని



పరిస్థితి అని ఆయన అన్నారు. మెడికల్ ప్రొఫెషన్ స్లో గా పెరగాలన్నారు. కేసీఆరే డాక్టర్ అయ్యాడు%ొ% కేసీఆరే ఇంజనీర్ అయ్యాడని ఆయన సెటైర్లు వేశారు. కరోనా కు పారాసిటామాల్ అన్నారు.. కాళేశ్వరం ఆయన్నే డిజైన్ చేశారన్నారు. హైదరాబాద్ లో 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల కోసం 9 వేల కోట్ల రూపాయలు లోన్ రూపంలో తీసేసుకున్నారని, 21 అంతస్తుల నుంచి 14 అంతస్తులకు తగ్గించామన్నారు దామోదర రాజనర్సింహ. వైద్య రంగంలో రెగ్యులేటరీ పవర్స్ అమలు చేద్దామన్నారు దామోదర రాజనర్సింహ. గత ప్రభుత్వ తీరుపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శలు తెలిపారు. సిద్దిపేట ఆస్పత్రిపై దృష్టి పెట్టి.. ఉస్మానియా ఆస్పత్రిని పట్టించుకోలేదని, పదేళ్లు పాలించి కనీసం ఉస్మానియా ఆస్పత్రిని కొత్తగా కట్టలేదన్నారు. సిటికి పక్కనే ఉన్న మహేశ్వరంలో మెడికల్ కాలేజీ ఎందుకు ఇచ్చారో తెలియదన్నారు దామోదర రాజనర్సింహ. ఇంజనీరింగ్ కాలేజీల మాదిరిగా మెడికల్ కాలేజీలు కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు.

# సిక్కింలో భారీ వర్షాలు అతలాకుతలం..

- చిక్కుకుపోయిన 15,000 మంది పర్యాటకులు
- 500 మందికి పైగా పర్యటకులను రక్షించిన రెస్క్యూ టీం

సిక్కిం,జూన్18 అక్షరం న్యూస్ :

సిక్కింలో భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఉత్తర సిక్కింలో చిక్కుకుపోయిన 500 మందికి పైగా పర్యాటకులను రక్షించారు. భారీ వర్షాల మధ్య బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ వారిని సేఫ్ చేసింది. మంగన్ నుండి లాచుంగ్ మార్గంలో పెద్ద ఎత్తున వరదలు రావడంతో.. 15,000 మంది పర్యాటకులు వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్నారు. మరోవైపు.. భారీ వర్షాలు, వరదల ధాటికి కొండచరియలు విరిగిపడ్డాయి. అంతేకాకుండా.. రోడ్డు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో.. ఉత్తర సిక్కింలో పర్యాటకులు చిక్కుకుపోయారు. మరోవైపు.. వాతావరణం అనుకూలించిన తర్వాత పర్యాటకులను తరలించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం.. ఒక ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లో సుమారు 50 మంది పర్యాటకులు గ్యాంగ్‌టక్‌కు తాత్కాలిక మార్గాల ద్వారా తరలించారు. అంతేకాకుండా.. మంగళవారం ఉదయం వర్షం పడటంతో.. కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో.. బెంగాల్-సిక్కిం సరిహద్దులోని రిషిఖోలా వద్ద %చీఎ% 10లో ట్రాఫిక్ నిలిచిపోయింది.ఇదిలా ఉంటే.. ఉత్తర సిక్కింలో జూన్ 12 నుంచి వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ విపత్తు బారిన పడి ఆరుగురు మృతి చెందారు. మరోవైపు.. భారీగా ఆస్తి నష్టం జరిగింది. దీంతో విద్యుత్, ఆహార సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. ఇంకా.. అనేక ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్‌లు నిలిచిపోయాయి.





## టీజీ పీజీఈసెట్ ఫలితాలు విడుదల




హైదరాబాద్,జూన్18 అక్షరం న్యూస్ :

తెలంగాణలో పీజీ కోర్సులకు సంబంధించి నిర్వహించిన టీజీ పీజీఈసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జేఎన్టీయు లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఛైర్మన్ లింబాద్రి తదితరులు పీజీఈసెట్ ఫలితాలను విడుదల చేశారు. కాగా జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పీజీఈసెట్ పరీక్షలను నిర్వహించారు. పరీక్ష నిర్వహించిన 4 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడం విశేషం. ఈ ప్రవేశ పరీక్షకు తెలంగాణ వ్యాప్తంగా 20,626 మంది విద్యార్థులు హాజరయ్యారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో పురోగతి

- సిట్ బృందానికి కీలక హార్ట్ డిస్కులు లభ్యం

హైదరాబాద్,జూన్18 అక్షరం న్యూస్ :

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసు దర్యాప్తులో సంచలన ఆధారాలు బయటకొస్తున్నాయి. ఇప్పటికే పలు ఆధారాలు సేకరించిన సిట్ బృందానికి మరో కీలక హార్ట్ డిస్కులు లభించాయి. ఎస్ఐబీకి టెక్నాలజీ అందించిన ఇన్నోవేషన్ ల్యాబ్‌లో హార్డ్ డిస్కులు సీజ్ చేశారు. ఇందులో మూడు సర్వర్లు, ఐదు మినీ డివైసస్‌తో పాటు హార్డ్ డిస్కులను సిట్ స్వాధీనం చేసుకుంది. ఇన్నోవేషన్ ల్యాబ్ చైర్మన్ రవికుమార్ ఇంటితోపాటు కార్యాలయంలో సిట్ సోదాలు నిర్వహించింది. దీంతోపాటు బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో సైతం సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో ల్యాబ్ ప్రతినిధులు స్టేట్ మెంట్‌లను కూడా సిట్ రికార్డు చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా రవికుమార్ ఇంట్లో దాచి పెట్టిన హార్డ్ డిస్కులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రణీత్ రావు.. ఇన్నోవేషన్ ల్యాబ్ సహకారం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా, ఆ సంస్థ చైర్మన్ రవికుమార్ ఇంట్లో లభ్యమైన హార్డ్ డిస్కులు కేసు దర్యాప్తును మలుపు తిప్పుతాయా? అనే ఉత్కంఠ అందిరిలోనూ నెలకొంది. కాగా, ప్రతిపక్ష నేతల ఇళ్లతోపాటు మూడు జిల్లాలో ల్యాబ్ మినీ కంట్రోల్ రూమ్ ఏర్పాటులో రవికుమార్ కీలక పాత్ర పోషించినట్లు సిట్ నిర్ధారించుకుంది. అయితే రవికుమార్‌ను విచారిస్తారా? నోటీసులు జారీ చేశారా? అనే విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది.

## పుతిన్, కిమ్ కీలక భేటీ

- గత 24 ఏళ్లలో ఇదే తొలిసారి భేటీ
- సైనిక సహకారంపై చర్చ ఇరువురి చర్చలు




ఉత్తర కొరియా,జూన్18 అక్షరం న్యూస్ :

ఉత్తర కొరియాలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ మేరకు పుతిన్ ఉత్తర కొరియాకు మంగళవారం ప్రత్యేక విమానంలో బయలుదేరారు. అయితే ఈ దేశంలో పుతిన్ పర్యటించడం గత 24 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం. పుతిన్ మొదటిసారి ఉత్తర కొరియాకు 2000లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా అప్పటి అధ్యక్షుడు కిమ్ తండ్రి కిమ్ జోంగ్ ఇల్‌తో సమావేశమయ్యారు. అమెరికా ఆంక్షలు, ఉక్రెయిన్‌పై రష్యా దాడులు, ఉత్తర కొరియా ప్యాంగ్యాంగ్ క్షిపణుల పరీక్షల నిర్వహిస్తున్న తరుణంలో పుతిన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా ఆంక్షలను ఇరు దేశాలు వేర్వేరుగా ఎదుర్కొంటున్నాయి. ఈ తరుణంలో కిమ్ ఆహ్వానం మేరకు పుతిన్ భేటీ కానున్నారు. ముఖ్యంగా ఇరు దేశాల మధ్య సైనిక సహకారం మరింత విస్తరించుకునేందుకు చర్చలు జరిగే అవకాశం ఉంది. ఒకవేళ ఇదే జరిగితే.. పరిస్థితి ఎలా ఉంటుందనే విషయంపై మిగతా దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు చేస్తున్న తరుణంలో.. రష్యానుంచి ఆర్థిక సహకారంతోపాటు సాంకేతిక పరంగా సహాయం తీసుకొని అవసరమైన ఆయుధాలు, క్షిపణులను ఉత్తరకొరియా ఇచ్చే అవకాశం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా నుంచి సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కోవడానికి సైనిక సహకారం వృద్ధి చేసుకునేందుకు ఇరు దేశాలు భావిస్తున్నాయి. అమెరికా విధించిన సవాళ్లను రష్యా, ఉత్తరకొరియా దేశాలు కలిసికట్టుగా ఎదుర్కొంటాయని పుతిన్ ధీమా వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక బంధం మరింత ఉన్నతస్థాయికి చేరుతుందని, అనేక విషయాల్లో పరస్పర సహకారంతో ముందుకెళ్తున్నాయని పుతిన్ వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు రష్యాకు ఉత్తర కొరియా ఆయుధాలు పరఫరా చేసే అవకాశం ఉందని పాశ్చాత్య దేశాలు భగ్గుమంటున్నాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం జరుగుతున్నందున బాంబులు, క్షిపణులతో పాటు సైనిక వ్యవస్థలను అందజేసే అవకాశం ఉందని తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ఉత్తర కొరియా, రష్యాపై అమెరికా కఠిన ఆర్థికపరమైన ఆంక్షలు విధించింది. అణ్వాయుధాల అభివృద్ధి విషయం, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా పుతిన్ పర్యటనలో ఇరు దేశాధినేతలు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేసే అవకాశం ఉంది. భద్రత, రక్షణపరమైన సహకారంపైనే ఇరు దేశాల మధ్య ఒప్పందం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఈ విషయంపై అమెరికా స్పందించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించింది. ఇరు దేశాలధినేతలు సమావేశం కావడంపై ఎలాంటి అభ్యంతరం లేదని, వారి మధ్య బలపడుతున్న బంధం ఆందోళన కలిగిస్తుందని అమెరికా భద్రతా మండలి అధికారి పేర్కొన్నారు.

# రుషికొండ విషయంలో కోర్టులకు తప్పుడు అఫిడవిట్

**అఫిడవిట్ ఇచ్చిన అధికారులపై చర్యలు తప్పవు**

**అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్**



అమరావతి,జూన్18(అక్షరం న్యూస్ :

రుషికొండ విషయంలో కోర్టులకు తప్పుడు అఫిడవిట్ ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని పార్లమెంటు దృష్టికి తీసుకెళ్తనన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి బాధ్యులపై చర్యలు ఖచ్చితంగా ఉంటాయని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బయట నుంచి వచ్చిన రెడ్లు ఉత్తరాంధ్రలో దందాలు చేశారని భారీగా భూ దోపిడీ జరిగిందన్నారు. దోపిడీకి గురైన భూముల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉత్తరాంధ్రలో జరిగిన భూ దోపిడీకి అధికార్లు సహకరించడం బాధాకరమన్నారు.ఐపీఎస్, ఐఏఎస్ అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే ఒక అధికారి పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అద్దాల మేడలో ఉండి జగన్ కన్న కలలు చెదిరిపోయాయన్నారు. పేదలకు సెంటు భూమి జగన్ కు రుషికొండ ప్యాలే సా అని ప్రశ్నించారు. ఢిల్లీలో ఏపీ భవన్ అభివృద్ధి చేయలేదు కానీ జగన్ కోసం రుషికొండలో ఖరీదైన ప్యాలస్ అవసరమా అన్నారు. ఉత్తరాంధ్రలో బీజేపీ బలోపేతం కోసం కృషి చేస్తానని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటి నుంచి దృష్టి పెట్టీ పనిచెయ్యాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. విశాఖలో అద్భుతమైన శాశ్వత కార్యాలయం నిర్మిస్తామని తెలిపారు.ఇటీవల కూడా సీఎం రమేష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నుంచి వచ్చే వారిని తీసుకోవడానికి ఎన్డీఏ కూటమి డంపింగ్ యార్డ్ కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని నష్టపరిచి దాకోవడానికి, దాచుకోవడానికి వచ్చేవారిని కూటమిలో చేర్చుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై కూటమి కుటుంబ సభ్యులు అపోహలు నమ్మొద్దని అన్నారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో రాష్ట్రం ఎంతగానో నష్టపోయిందని చెప్పారు. ఐదేళ్లలో దందాలు చేసిన ఏ ఒక్కరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# రెండ్రోజుల్లో అన్ని స్టాక్ పాయింట్లలో తనిఖీలు పూర్తి చేయాలి

**సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల మనోహర్**



అమరావతి,జూన్18(అక్షరం న్యూస్ :

అన్ని స్టాక్ పాయింట్లలో తనిఖీలు పూర్తి చేయాలని సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. సివిల్ సప్లయిస్ కార్యాలయంలో తూనికలు కొలతలు విభాగపు అధికారులతో సివిల్ సప్లయిస్ మంత్రి మనోహర్ నాదెండ్ల సమీక్షించారు. తూనికలు కొలతలు విభాగంలోని పెండింగ్స్, పౌరసరఫరాల అంశంలో ఇప్పటికి ఉన్న పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "లీగల్ మెట్రాలజీ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించాను. రెండు రోజుల క్రితం తెనాలిలో మండల స్థాయి స్టాక్ పాయింట్లో తనిఖీ చేశా. కందిపప్పు, పంచదార, పామాయిల్ తూకాల్లో తేడా కనిపించింది. ప్యాకెట్ల తూకంలో 50 నుంచి 80గ్రాములు తక్కువగా కనిపించింది. రాష్ట్రంలో 253 మండల లెవల్ స్టాక్ పాయింట్లలో తనిఖీలు చేసి రిపోర్టు ఇవ్వాలని అప్పుడే ఆదేశించా. ఇప్పటి వరకు 62 ఎంఎల్ఎస్ కేంద్రాల్లో తనిఖీలు పూర్తయ్యాయి. 24 చోట్ల అక్రమాలు తేలాయి. బాధ్యులపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తున్నాం. సరకులు సరఫరా చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించా." అని వ్యాఖ్యానించారు. అక్రమాలు చేసిన వారు, దీని వెనుక ఉన్న వారెవరినీ వదిలిపెట్టమని సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. అక్రమార్కులు అందరిపైనా కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే సరుకుల్లో దోపిడీ చేయడాన్ని చాలా సీరియస్ గా తీసుకుంటామని తెలిపారు. ప్రజలంతా మార్పును కోరారు.. ఆ మేరకు మార్పు తప్పక ఉంటుందన్నారు. మేము నిజాయితీగా, చట్ట ప్రకారం వ్యవహరిస్తామని.. ఎవరైనా ప్రజల ఇబ్బంది పెట్టినా.. మోసం చేసినా సహించేదిలేదన్నారు. ధాన్యం అమ్ముకునే రైతులకు అన్యాయం జరగదు పారదర్శకంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు.

# పోలవరాన్ని 72 శాతం పూర్తి చేసిన ఘనత చంద్రబాబుదే

**టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ**

అమరావతి,జూన్18((అక్షరం న్యూస్ :)



ఆంధ్రుల జీవనాడి పోలవరంను జగన్ అదోగతి పాలు చేశారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ అన్నారు. 20 ఏళ్ల క్రితం వైయస్ శంకుస్థాపన చేసినా ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. మంగళవారం అమరావతిలో ఆమె మీడియాతో మాట్లాడారు. కమీషన్ల కోసం జల యజ్ఞాన్ని ధన యజ్ఞంగా మార్చారని ఆరోపించారు. పోలవరాన్ని పరుగులు పెట్టించి 72 శాతం పూర్తి చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదే అని కొనియాడారు. ఒక్క రోజులో 35 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి గిన్నిస్ రికార్డు సృష్టించారని తెలిపారు. జగన్ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని రాచపీనుగులా పీక్కు తిన్నారని మండిపడ్డారు. రివర్స్ టెండరింగ్ పేరుతో కమీషన్లు దండుకుని ప్రాజెక్టును గోదాట్లో ముంచారని తీవ్ర ఆరోపణలు చేశారు.పోలవరం పూర్తైతే 7 లక్షల 20 వేల ఎకరాలకు సాగునీరందేదని.. 23 లక్షల ఎకరాల ఆయకట్టు స్దిరీకరణ అయ్యేదని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ అన్నారు. ఉత్తరాంధ్ర 4 జిల్లాల్లో 48 మండలాలు, 548 గ్రామాలకు తాగునీరు అందేదని.. విశాఖ పారిశ్రామిక హబ్ గా ఎదిగేదని పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలు, ఛత్తీస్ గడ్, ఒడిషా కూడా నీళ్లిచ్చేవాళ్లమన్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తానని జగన్ రూ. 500 కోట్లతో ప్యాలస్ కట్టుకున్నారని ఆరోపించారు. ఇదేనా మీరు చేసిన ఉత్తరాంధ్ర అభివృద్ధి.. పోలవరం పూర్తి చేసేది చంద్రబాబే, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేది చంద్రబాబే అని వ్యాఖ్యానించారు.కాగా.. సోమవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. హెలికాప్టర్‌లో నుంచి పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే సహా వివిధ ప్రాంతాలను వీక్షించారు. సీఎంకు హెలిప్యాడ్ దగ్గర మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం ప్రాజెక్ట్ దగ్గరకు చేరుకున్న చంద్రబాబు.. అధికారుల్ని అడిగి ప్రాజెక్ట్ పనుల్లో పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ప్రాజెక్ట్ స్పిల్ వే, కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ పనులపై ఆరా తీశారు. ప్రాజెక్ట్ 22, 23 గేట్ల నుంచి పరిశీలన చేశారు.

# చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి ఇక అన్నీ మంచిరోజులే

- **ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నారు**
- **కౌరవ సభ స్థానంలో కొలువుదీరనున్న గౌరవ సభ..**
- **ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేర్చుతుంది**
- **సంచలన ట్వీట్ చేసిన నారా భువనేశ్వరి**

అమరావతి,జూన్18అక్షరం న్యూస్ :)



ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి సోషల్ మీడియా(ఎక్స్)లో సంచలన ట్వీట్ చేశారు. అందులో ఆమె పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కౌరవ సభ స్థానంలో కొలువుదీరనున్న గౌరవ సభ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుతూ.. తమ అభిప్రాయాలను చెప్పగలుగుతున్నారని భువనేశ్వరి అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాలను ప్రజలు నిర్భయంగా ప్రస్తావిస్తూ.. తాము పడిన క్షోభపై బయటకు వచ్చి గళం విప్పుతున్నారన్నారు. మహిళలు తమ రక్షణపై, తల్లులు తమ బిడ్డల భవిష్యత్ విషయంలో ధైర్యంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి ఇక అన్నీ మంచిరోజులే వస్తాయంటూ ఆమె ధీమా వ్యక్తం చేశారు. నిజం గెలవాలి పర్యటనలో తాను ప్రజలను దగ్గర నుంచి చూశానని, ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రజలు తామే గెలిచామన్న సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆశలు మళ్లీ చిగురిస్తుండడం తనకు ఎంతగానో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. చంద్రబాబు పాలనలో అమరావతి రాజధానిగా మళ్లీ గర్వంగా నిలబడుతుందన్నారు. రాజధాని రైతుల పోరాటాలు ఫలించి వారి జీవితాల్లో చీకట్లు తొలగిపోయాయంటూ ఆమె పేర్కొన్నారు. చంద్రబాబు దీక్ష, పట్టుదలతో జీవనాడి పోలవరం సవాళ్లను, విధ్వంసాన్ని అధిగమించి ముందడుగు వేస్తుందని ఆమె చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికి మంచి చేయాలనే చంద్రబాబు సంకల్పం నేరవేరుతుందంటూ ఆమె ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత ప్రజాప్రభుత్వం తీసుకుంటుందని భువనేశ్వరి ఆకాంక్షించారు. అదేవిధంగా పార్టీ కార్యకర్తల గురించి ఆమె మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా కృషి చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. అయినా కూడా ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా ప్రాణాలను సైతం పణంగాపెట్టి పనిచేశారని, వారందరికీ కూడా గౌరవం దక్కుతుందని భువనేశ్వరి హామీ ఇచ్చారు. చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శించిన ఫొటోలను అందులో షేర్ చేస్తూ పై విధంగా పేర్కొన్నారు.

## అన్ని సౌకర్యాలతో గృహాలు నిర్మించే బాధ్యత ప్రభుత్వానిదే

- **రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి**

అమరావతి,జూన్18(అక్షరం న్యూస్ :

గృహానిర్మాణాలు సకాలంలో పూర్తి చేయటానికి కార్యాచరణ, ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో గృహాలు నిర్మించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మంగళవారం గృహ నిర్మాణ శాఖపై మంత్రి పార్థసారథి సమీక్ష నిర్వహించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని మంత్రి ఆదేశించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించే అవకాశాలపై నివేదికలు రూపొందించాలన్నారు. ఆప్షన్- 3 కింద నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్లతో సమావేశమై సకాలంలో గృహాలు పూర్తి చేయాలని ఆదేశించారు.కాగా.. ఇటీవల ఏర్పడిన కూటమి ప్రభుత్వం కొలుసు పార్థసారథికి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ బాధ్యతలు అప్పజెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లోని కీలక నేతల్లో ఆయన ఒకరు. పార్థసారథి 1965 ఏప్రిల్ 18న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కరకంపాడులో రాజకీయ కుటుంబంలో జన్మించారు. అతని తండ్రి, కొలుసు పెదారెడ్డి.. ఆయన 1991, 1996లో మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గ సభ్యునిగా ఎన్నికయ్యారు. పార్థసారథి 2024 ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్థసారథి కాంగ్రెస్ పార్టీ నుంచి 2004 (వుయ్యూరు), 2009 (పెనమలూరు)లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో వైసీపీలో చేరిన పార్థసారథి మచిలీపట్నం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

## జమ్మూకశ్మీర్‌లోని పూంచ్‌లో ఎన్‌కౌంటర్

పూంచ్,జూన్18((అక్షరం న్యూస్ :)

జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో భద్రతా బలగాలు-ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరుగుతున్నట్లు సమాచారం అందుతుంది. ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసుల బృందంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్లు సమాచారం. దీంతో.. వెంటనే అదనపు బలగాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. పూంచ్ ప్రాంతంలో ఇద్దరు టెర్రరిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతానికి అదనపు బలగాలను పంపించామని.. ఉగ్రవాదులు భద్రతా బలగాలపై కాల్పులు జరిపారని అధికారులు చెబుతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో జమ్మూ కాశ్మీర్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ బృందంపై కాల్పులు జరిపినట్లు సోర్సెస్ చెబుతున్నాయి. అనంతరం ఉగ్రవాదుల ఆచూకీ కోసం భద్రతా బలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. జూన్ 9 తర్వాత జమ్మూ ప్రాంతంలో ఇది ఆరో ఉగ్రవాద ఘటన. జూన్ 9న.. ఉగ్రవాదులు యాత్రికుల బస్సుపై దాడి చేశారు. ఈ దాడిలో 9 మంది యాత్రికులు మరణించారు. 41 మంది గాయపడ్డారు. ఇండియా టుడే, న్యూఢిల్లీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ సంకలనం చేసిన డేటా ప్రకారం.. జనవరి 2023 నుండి జమ్మూ ప్రాంతంలో 29 ఉగ్రవాద సంఘటనలలో 42 మంది పౌరులు, భద్రతా దళ సిబ్బంది మరణించారు. ఇది జనవరి 2023 నుండి కాశ్మీర్ డివిజన్‌లో సంభవించిన మరణాల సంఖ్య కంటే దాదాపు రెట్టింపు. 2024 జూన్ 13 వరకు కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్, శ్రీనగర్, బారాముల్లా, కుల్గాం, పుల్వామా మరియు షోపియాన్ జిల్లాల్లో జరిగిన ఉగ్రవాద దాడుల్లో 24 మంది పౌరులు, భద్రతా సిబ్బంది మరణించినట్లు యొక్క దక్షిణాసియా ఉగ్రవాద పోర్టల్ చూపిస్తుంది.

# బీహార్‌లో ప్రారంభోత్సవానికి ముందే కూలిపోయిన బ్రిడ్జి

**అరారియాలో రూ.12 కోట్ల రూపాయలతో వంతెన నిర్మాణం**

అరారియా,జూన్18 అక్షరం న్యూస్ :

బీహార్‌లో ప్రారంభోత్సవానికి ముందే ఓ బ్రిడ్జి కూలిపోయింది. బీహార్‌లోని అరారియాలో రూ.12 కోట్ల రూపాయలతో వంతెనను నిర్మించారు. అయితే వంతెన ప్రారంభోత్సవానికి ముందే కుప్పకూలిపోయింది. సిక్తి, కుర్సకాంత బ్లాక్‌లను కలుపుతూ బక్రా నదిపై రూ.12 కోట్ల రూపాయల వ్యయంతో వంతెనను నిర్మించారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి నష్టం జరగలేదు. ఇందుకు ఫొటోలు, వీడియోలు మాత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఏడాది మార్చిలో కూడా బీహార్‌లోని సుపాల్‌లో నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోవడంతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. 10 మంది గాయపడ్డారు. కోసి నదిపై నిర్మిస్తున్న వంతెన స్లాబ్ కూలిపోవడంతో భేజా మరియు బకౌర్ మధ్య ఉన్న మరీచా దగ్గర ఈ ఘటన జరిగింది.

# నెల్లూరు అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచారం

**అటవీ శాఖ అధికారి వెల్లడి**

అమరావతి,జూన్18( అక్షరం న్యూస్ :

నెల్లూరు జిల్లాలోని అటవీ ప్రాంతంలో పెద్ద పులి ఉందని..పెద్ద పులి ఉండటం మనకు గర్వకారణమని జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు. పెద్ద పులిని అనుక్షణం పర్యవేక్షిస్తున్నామన్నారు. సమీప గ్రామాలు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సురక్షితంగా ఉందని..మర్రిపాడు వద్ద కారుకు జరిగిన డ్యామేజ్ ప్రకారం పెద్దపులి కొట్టినట్లుగా అనిపించడం లేదన్నారు. కారుపై పులి దాడి చేసిందనేది అవాస్తవం అని తెలిపారు. ఈ ఘటనపై మరింత సమగ్రంగా విచారణ చేస్తున్నామని చెప్పారు. ఎక్కడా రక్తపు మరకలు కూడా లేవని..ప్రమాదం జరిగిన ప్రాంతంలో పులికి సంబంధించిన పాద ముద్రలు కనిపించాయన్నారు. పులులు ఎప్పుడూ రాత్రి సమయంలో సంచరిస్తాయని తెలిపారు. పులికి ఏదైనా ప్రమాదం జరిగితే నొప్పికి తీవ్రంగా అరుస్తుందన్నారు. సమీప ప్రాంతంలో ఎక్కడా పులి అరుపులు వినిపించలేదని స్పష్టం చేశారు. డ్రోన్ తో సమీప ప్రాంతాల్లో తనిఖీ చేశామని చంద్రశేఖర్ పేర్కొన్నారు. పెద్ద పులి సురక్షితంగా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్ళ వద్దని కోరుతున్నామన్నారు. పెద్ద పులి సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అటవీ ప్రాంతంలో జంతువులకు నీటి సమస్య లేదని స్పష్టం చేశారు. సోమవారం నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి సమీపంలోని నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారుపై పెద్దపులి దాడి చేసిందని..ప్రయాణికులు తెలిపారు. పులిని తప్పించే క్రమంలో కారు బోల్తా పడిందని.. వాహనం ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యిందన్నారు. కారు ఢీకొనడంతో పులికి గాయాలయ్యాయని వారు పేర్కొన్నారు. బద్వేల్ నుంచి నెల్లూరు వెళ్తుండగా కదిరినాయుడుపల్లి అటవీ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందని బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంపై స్పందించిన అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ స్పందించారు. పులి దాడి చేయలేదని.. పులి సురక్షితంగానే ఉందని ఆయన పేర్కొన్నారు.

# మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి కడప పర్యటన రద్దు

అమరావతి,జూన్18అక్షరం న్యూస్ :)ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తొలిసారి తన సొంత నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు ప్రకటన విడుదలైంది. తాజాగా జగన్మోహన్ రెడ్డి కడప జిల్లా పర్యటన రద్దైంది. ఈనెల 21, 22 నుంచి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పర్యటన రద్దు చేసుకున్నారు. మాజీ సీఎం జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్నారు. కాగా.. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల తేదీల్లో మార్పు జరిగింది. తొలుత జూన్ 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని భావించారు. అయితే తాజాగా జూన్ 21 నుంచి అసెంబ్లీ మీటింగ్స్ జరపాలని నిర్ణయం తీసుకున్నారు. జూన్ 21, 22 తేదీల్లో రెండురోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ రెండు రోజుల సమావేశాల్లో ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అలాగే అసెంబ్లీ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించేందుకు తొలుత ప్రొటెం స్పీకర్‌కు ఎంపిక చేయాల్సి ఉంటుంది. శాసనసభకు ఎక్కువసార్లు ఎన్నికైన, సుధీర్ఘ అనుభవం ఉన్న నేతను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రొటెం స్పీకర్‌గా టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యవహరించే అవకాశం ఉంది.

## భగీరథ పైపుల ద్వారా పాకూరు నీళ్లు...

- తాగునీరు లేక అవస్థలు పడుతున్న ప్రజలు...
- స్వచ్ఛమైన తాగునీరు అందించాలి...
- విశ్వ జంపాల నాయవాది మరియు విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు...



**మహబూబాబాద్ /గార్ల /జూన్ 18/అక్షరం న్యూస్:** గార్ల మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపుల ద్వారా గత మూడు రోజులుగా ఆకు పచ్చ రంగులో ఉన్న పాకూరు నీళ్ళు వస్తున్నాయి. ప్రజలు త్రాగు నీరు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో వేసవి కాలం తలపించేలా ఎండలు విపరీతంగా మండుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం మూలంగా స్వచ్ఛమైన అందక అరిగొషా పడుతున్న ప్రజలకు సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే భగీరథ పైపుల ద్వారా పరిశుభ్రమైన స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## నీట్ పరీక్షలను తక్షణమే రద్దు చేసి మళ్ళీ పరీక్ష నిర్వహించాలి

- ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ...









**మహబూబాబాద్ /గార్ల /జూన్ 18/అక్షరం న్యూస్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నీట్ ఫలితాలలో జరిగిన అవకతవకలపై దర్యాప్తు జరిపి సంబధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, వచ్చిన ఫలితాలను నిలిపివేసి మరల పరీక్ష నిర్వహించాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన, భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ, ఎన్ ఎస్ యు ఐ, ఏ ఐ ఎస్ ఎఫ్, పి డి ఎస్ యు, వి జె ఎస్, ఏ ఐ వై ఎఫ్ విద్యార్థి సంఘాల జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నెహ్రూ విగ్రహా కూడలి వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.

## మిషన్ భగీరథ నీళ్లు తక్షణమే అందించాలి

-ప్రజలదాహార్తిని తీర్చాలి
- భగీరథ నీళ్ల కోసం అధికారులను నిలదీసిన ప్రజలు



**మహబూబాబాద్ /గార్ల /జూన్ 18/అక్షరం న్యూస్:** మహబూబాబాద్ జిల్లా,బయ్యారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో ఎస్టి కాలనీ, హేమ్ల తండ వాసులు గత ఆరు నెలల నుండి మిషన్ భగీరథ నీళ్లు రాక అవస్థలు పడుతున్నారు.అధికారులకు ఎంత మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని,ఏమి చేసేది లేక నీళ్లు ఎందుకు రావడం లేదని మిషన్ భగీరథ ఆపరేటర్లను గ్రామస్తులు, మహిళలు నిలదీశారు. కొత్తపేట గ్రామంలో గంధంపల్లి మంచినీటి బావి నుండి నీరు ఇస్తున్నారు, కనీసం మిషన్ భగీరథ నీళ్లు కూడా అందని ఎస్టీ కాలనీ, హేమ్లతండ విధుల్లో ఉన్నటువంటి సుమారు ఒక నాలుగు వందల కుటుంబాలకు నీళ్లు లేక బోర్లలో నీరు లేక చాలా ఇబ్బందులు పడుతూ ఎవరికీ తెలియజేసినా కూడా ఎటువంటి స్పందన లేకుండా పోయిందని ఆగ్రహంతో గ్రామ ప్రజలు రోడ్డుమీదికి వచ్చి నిరసన తెలియజేశారు. అధికారులు వెంటనే స్పందించి మిషన్ భగీరథ మంచినీటిని సరఫరా చేయాలనీ విజ్ఞప్తి చేశారు.

## గాయపడిన గీత కార్మికుడిని పరామర్శించిన మోకుదెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్

**వరంగల్ జిల్లా/ చెన్నారావుపేట మండలం/ జూన్ 18 అక్షరం న్యూస్:** మండలంలోని జల్లి గ్రామానికి చెందిన మేరుగు సంపత్ గౌడ్ అనే గీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలిసిన గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ తెలంగాణా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, రాజు గౌడ్, మంగళవారం పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ సంపత్ గౌడ్ కు ఎక్సైజ్ శాఖ , బీసీ. కార్పొరేషన్ నుండి ఎక్స్ గ్రేషియా, హాస్పిటల్ ఖర్చుల కొరకు దరఖాస్తు చేయడం జరుగుతుందన్నారు. గత ఆరు నెలలుగా గాయపడిన, చనిపోయిన గీత కార్మికులకు పెండింగ్ ఎక్స్ గ్రేషియా, హాస్పిటల్ ఖర్చులు చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్పొరేషన్ కు చైర్మన్ ను నియమించాలని, కార్పొరేషన్ కు 500 కోట్లు నిధులు కేటాయించాలని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు.సంపత్ గౌడ్ ను పరా మర్శించిన వారిలో మదూరి సోమన్న గౌడ్, జక్కుల మధు గౌడ్, మేరుగు నవీన్ గౌడ్, చలమళ్ళ సత్యం గౌడ్, మల్లయ్య గుడ్ తదితరులు ఉన్నారు.



# అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలి

- పెండింగ్ లో ఉన్న గ్యాస్ బిల్లులను విడుదల చేయాలి...
- అంగన్వాడీ టీచర్ లకు రు. 26వేలు, హెల్పర్ లకు 21వేల రూపాయలు వేతనం ఇవ్వాలి...
- బి. అజయ్ సారధి రెడ్డి ఏఐటీయుసి జిల్లా అధ్యక్షులు...



**మహబూబాబాద్ /గార్ల /జూన్ 18/అక్షరం న్యూస్:** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు బి. అజయ్ సారధి రెడ్డి, అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారిశ్వరి డిమాండ్ చేశారు.తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఎఐటియుసి అనుబంధం రాష్ట్ర సమితి పిలుపుమేరకు మహబూబాద్ జిల్లా కేంద్రంలో అంగన్వాడీల ఆధ్వర్యంలో సిడిపిఓ రాజ్యలక్ష్మి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారధి రెడ్డి,అంగన్వాడి అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారీశ్వరి లు మాట్లాడుతూ,అంగన్వాడి టీచర్లకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, హెల్పర్లకు కనీస వేతనం 21 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటర్లకు అద్దె భవనాల్లో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రభుత్వం స్థలం కేటాయించి అంగన్వాడి కేంద్రాలకు భవనాలు నిర్మించాలని కోరారు.అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రెండు లక్షల రూపాయలు, హెల్పర్లకు లక్ష రూపాయలు వెంటనే అందించాలన్నారు. సమ్మె కాలంలో వేతనాలు చెల్లించాలని,పెండింగ్ లో ఉన్న అద్దె, గ్యాస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎంపీపీ ఎస్ పాఠశాలలలో క్లబ్ అయినటువంటి అంగన్వాడీ సెంటర్లను ప్రభుత్వ నిర్ణయాలకు విరుద్ధంగా ఏకపక్షంగా ఇష్టారితిన బయటకు పంపించే చర్యలను మానుకోవాలన్నారు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సిడిపిఓ కి అందజేశారు.సిడిపిఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వ దృష్టికి సమస్యలన్నీ తీసుకువెళ్లి, పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బానోతు లలిత,కీసర సౌమ్య, పెరుగు వరలక్ష్మి, రజియా, శివకుమారి,పద్మ,స్వప్న, భానుమతి , పెరుగు కుమార్ చింతకుంట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# గౌరెడ్డిపేట గ్రామంలో జ్వరాల నియంత్రణకు చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత
- గౌరెడ్డిపేట లో ఉన్న ప్రైవేట్ వాటర్ ప్లాంట్ సీజ్
- ప్రతి రోజూ గ్రామంలో ఫాగ్గింగ్ నిర్వహించాలని ఆదేశం
- ప్రజలు మీషన్ భగీరథ నీటిని కాచి చల్లార్చి త్రాగాలని సూచన
- పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామాన్ని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి



**పెద్దపల్లి, ప్రతినిధి జూన్ -18 అక్షరం న్యూస్:** గౌరెడ్డిపేట గ్రామంలో ప్రజలకు వస్తున్న జ్వరాల నియంత్రణకు అవసరమైన చర్యలు పకడ్బందీగా తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తెలిపారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి ఆశా లత పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామాన్ని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, మిషన్ భగీరథ సాంకేతిక నిపుణులతో కలిసి సందర్శించారు. గౌరెడ్డి పేట గ్రామాన్ని ఆసాంతం పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి బృందం, జ్వరం, ఒళ్ళు నొప్పులతో బాధపడుతున్న వారిని పరిశీలించి వారికి వైద్య సిబ్బందితో తగిన వైద్య చికిత్స అందించడం జరిగిందని, ప్రస్తుతం గ్రామంలో జ్వరాలు తగ్గుముఖం పట్టాయని పంచాయతీ అధికారి తెలిపారు.

గ్రామంలోని ప్రతి వీధిని పరిశీలించిన పంచాయతీ అధికారి కాలువలు, రోడ్ల శుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు, ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి కాల్వల దగ్గర ఫాగింగ్ చేయించాలని జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. గ్రామ ప్రజలంతా ప్రైవేట్ మినరల్ ప్లాంట్ నుంచి త్రాగునీరు తాగుతున్నారని తెలుసుకున్న పంచాయతీ అధికారి బృందం, సదరు ప్రైవేట్ మినరల్ ప్లాంట్ ను సందర్శించి ఆ నీటిని పరీక్షించగా అందులో లవణాల శాతం 50 శాతం మాత్రమే ఉండటంతో గ్రామ ప్రజలకు జాయింట్ పెయింట్స్ వస్తున్నాయని మిషన్ భగీరథ సాంకేతిక నిపుణులు తెలియజేశారు. గ్రామ ప్రజలకు ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నీటిని తాగకూడదని వివరించడం జరిగిందని, అదే విధంగా ప్రైవేట్ వాటర్ ప్లాంట్ ను శాశ్వతంగా సీజ్ చేసి మూసివేయడం జరిగిందని, గ్రామ ప్రజలకు సరఫరా చేసే మిషన్ భగీరథ, బోర్ నీటిని పరిశీలించగా లవణాలు 200 శాతం పైగా ఉన్నట్లు గుర్తించామని, గ్రామ ప్రజలు మిషన్ భగీరథ నీటిని కాచి, చల్లార్చి తాగాలని పంచాయతీ అధికారి సూచించారు. గౌరెడ్డి పేట గ్రామంలో వైద్య సిబ్బందిచే మెడికల్ క్యాంపు నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని పంచాయతీ అధికారి పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా పంచాయతీ అధికారి వెంట డివిజనల్ పంచాయతీ అధికారి, మండల పంచాయతీ అధికారి, ఎంపీడీవో, వైద్యాధికారులు, మిషన్ భగీరథ సాంకేతిక నిపుణులు, తదితరులు పాల్గొన్నారు.

# బేబి సహస్రకు నివాళులర్పించిన జాతీయ మానవ హక్కుల కమిటీ

- కొవ్వొత్తులతో ఘన నివాళి.
- ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలి.




**సుల్తానాబాద్,(పెద్దపల్లి జిల్లా),జూన్ 18,(అక్షరం న్యూస్):** సుల్తానాబాద్ పట్టణంలో జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా కమిటీ అధ్యక్షులు పూసాల కృష్ణ, సుల్తానాబాద్ మండల అధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్ ఆధ్వర్యంలో బేబీ సహస్రకు ఘన నివాళు లర్పించారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో బేబీ సహస్రకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య మాట్లాడుతూ బేబీ సహస్ర పై జరిగిన ఆ మానవీయ సంఘటనను ఖండిస్తూ పసిపిల్లలను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు.ఈ సందర్భంగా పోలీసుల పాత్రను ప్రశంసించారు. సంఘటన జరిగిన అతి తక్కువ సమయంలోనే పోలీసులు చాకచక్యంగా నిందితుడిని పట్టుకోవడంతో పాటు కేసు నమోదు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ముక్కుపచ్చలారని చిన్నారిపై ఆకృత్యానికి పాల్పడిన దోషిని వెంటనే కఠినంగా శిక్షించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ రామగుండం సి.పి లకు విజ్ఞప్తి చేశారు. గతంలో పోలీసు ఉన్నతాధికారి సజ్జనార్ స్పందించిన విధంగా స్పందిస్తే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని అధికారులకు సూచించారు. మంత్రులు హామీ ఇచ్చిన విధంగా చిన్నారి కుటుంబంలో వెంటనే ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు.సోమవారం రోజు ఏ.సి.పి.గజ్జి కృష్ణ చేసిన సూచనల మేరకు రైస్ మిల్లర్ యజమానులు వలస కూలీల కుటుంబాలకు గృహాలను విడిగా కల్పించాలని, వలస కూలీల రక్షణ బాధ్యత ను కూడా నిర్వర్తించాలని విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. రైస్ మిల్లర్ యజమానులు ఈ సూచనలను వీలయినంత త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.కనీస వసతులు అమలు చేయని పక్షంలో కార్మికుల తరపు నుంచి గళం వినిపిస్తామని అన్నారు.వలస కార్మికులకు సరైన వసతులు సమకూర్చకుండా, మానవ హక్కులను లెక్కచేయకుండా,అమానవీయంగా శ్రమ దోపిడి చేస్తున్న రైస్ మిల్, ఇటుక బట్టి యజమానుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. బేబి సహస్ర లాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసులపై పాటు రైస్ మిల్లర్ ఇటుక కార్మికుల ఇటుక బట్టీలు యజమానులపై ఉందని అన్నారు. బాధిత కుటుంబానికి చేసిన హామీలు అమలు జరిగాయో లేదో తెలుసుకునేందుకు బాధిత కుటుంబాలను కలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, జోనల్ కమిటీ కో కన్వీనర్ ఇంజం సాంబశివరావు, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్ల వంశీ,ప్రచార కార్యదర్శి కొత్త కమలాకర్, జాయింట్ సెక్రటరీ బొడ్డుపల్లి సదయ్య, సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు యూసుఫ్ ,పెద్దపల్లి మండల అధ్యక్షుడు హరిబాబు, జనరల్ సెక్రెటరీ బొడ్డుపల్లి కనకయ్య, జులపెల్లి మండల అధ్యక్షుడు తిరుపతి, కమాన్ పూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రామగిరి మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ రాజు,మంథని మండల అధ్యక్షులు రమేష్, కల్లిపెల్లి కుమార్,అడపా బాపూరెడ్డి, సమీర్, బొజ్జ క్రాంతి, రమేశ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి న్యూఢిల్లీలో శుభాకాంక్షలు తెలిపిన బీజేపి శ్రేణులు

**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -18(అక్షరం న్యూస్ ):** కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కరీంనగర్ ఎంపీ, బిజెపి తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు. బండి సంజయ్ కు శుభాకాంక్షలు తెలపడానికి ముస్తాబాద్ బీజేపీ మండల అధ్యక్షులు మేరుగు అంజగౌడ్ వారి బృందంతో శంషాబాద్ విమానాశ్రయం నుండి ఢిల్లీ బయలుదేరి వారిని ఢిల్లీలోని స్థానిక నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు బండి సంజయ్ కుమార్ ని శాలువాతో సన్మానించి పూల గుచ్ఛం అందచేశారు.. కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినందుకు హర్షం వ్యక్తం చేశారు పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేసిన సంజయ్ అన్న కి సముచిత స్థానం కల్పించినందుకు ప్రధాని మోడీ, హెూం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాలకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.సామాన్య కార్యకర్తగా బీజేపీలో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన బండి సంజయ్ నేడు కేంద్ర మంత్రి స్థాయికి చేరుకోవడం సంతోషకరమన్నారు. ఇది బీజేపీలోనే సాధ్యమన్నారు.బండి ని కలిసిన వారిలో మండల బీజేపీ అధ్యక్షులు మేరుగు అంజాగౌడ్.ప్రధాన కార్యదర్శులు, సౌళ్లక్రాంతి,బాధనరేశ్,ఓ బీ సి .మోర్చా మండల అధ్యక్షుడు. చిగురు వెంకన్న,రమేషగౌడ్,ఉరడిరాజు,గణేష్ లు ఉన్నారు



## మేజర్ గ్రామపంచాయతీ ఇంచార్జి ఈవోగా బూస మల్లికార్జున్



**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -18(అక్షరం న్యూస్ ):** ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ ఇంచార్జి ఈవో గా బూస మల్లికార్జున్ పదవి బాధ్యతలు చేపట్టారు. ఈవో గా పనిచేస్తున్న రాజు అనారోగ్యం కారణంగా దీర్ఘకాలిక సెలవు పై వెళ్లడంతో మేజర్ గ్రామపంచాయతీ పరిపాలన సౌలభ్యం కోసం మండల అభివృద్ధి అధికారి అవునూర్ గ్రామ కార్యదర్శిగా, రామలక్ష్మణ పల్లి పంచాయతీ ఇంచార్జి గా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున్ ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ ఇంచార్జి గా ఈవోగా మంగళవారం విధులు చేపట్టారు .

## బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ 2గ్రాండ్ టెస్ట్ లను సద్వినియోగం చేసుకోవాలి

**- డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి**



**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -18(అక్షరం న్యూస్ ):** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న గ్రూప్ 2 పరీక్షకు కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కు రాజన్న సిరిసిల్ల బీ సి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నాలుగు గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల బీ సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఒక ప్రకటన లో తెలిపారు.మొదటి గ్రాండ్ టెస్ట్ జులై 7నుండి 9వ తేదీ వరకు, రెండొవ గ్రాండ్ టెస్ట్ జులై -15,16తేదీలలో మూడోవ గ్రాండ్ టెస్ట్ తేదీ జులై 22,23తేదీలలో,నాలుగో వ గ్రాండ్ టెస్ట్ లు జులై 30,31%ఋ% తేదీలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సమయం పేపర్ 1,3 ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12.30 వరకు,పేపర్ 2,4మధ్యాహ్నం 1.30నుండి 4గంటల వరకు సంబంధిత తేదీ లలో నిర్వహిస్తామని తెలిపారు. గ్రాండ్ టెస్టులకుఆసక్తి ఉండి హాజరు కావాలనుకున్నవాళ్లు సంబధిత వెబ్ సెట్ లో ఆన్ లైన్ ద్వారా తేదీ జూన్ 6వ తేదీ నుండి జులై 19వ తేదీవరకు దరఖాస్తు లు సమర్పించాలని కోరారు.మరిన్ని వివరాలకోసం 938188749,లేదా 02723-223004 ని సంప్రదించాలని కోరారు

## అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోండి

**- సీపెల్లి రవీందర్ సీపీఎం పార్టి పెద్దపల్లి ఏరియా కార్యదర్శి**



**పెద్దపల్లి టౌన్ జూన్ 18 అక్షరం న్యూస్ :** సీపీఎం పార్టీ పెద్దపల్లి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో అధిక ధరలకు అమ్ముతున్న ఎరువులు విత్తనాల దుకాణాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓ శ్రీనివాస్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పెద్దపెల్లి ఏరియా కార్యదర్శి సీపెల్లి రవీందర్ మాట్లాడుతూ పెద్దపల్లి సుల్తానాబాద్ కేంద్రాలలో ఉన్నటువంటి ఎరువులు విత్తనాల యజమానులు లాభార్జనే ధ్యేయంగా ఎరువులు విత్తనాలు బ్లాక్ మార్కెట్ చేసి అధిక ధరలకు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారని అన్నారు నకిలీ విత్తనాలు మార్కెట్లో విచ్చలవిడిగా ఎరువుల దుకాణం యజమానులు విక్రయిస్తూ అధిక లాభం పొందుతున్నారని వెంటనే ఎరువులు విత్తనాల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమ ధాంధలను నియంత్రించాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కల్లెపల్లి అశోక్ నాయకులు జిల్లాల ప్రశాంత్ రాంచరణ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సినిమా థియేటర్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన

**- స్టేషన్ ఫైర్ ఆఫీసర్ డి.శ్రీనివాస్**



**పెద్దపల్లి, టౌన్ జూన్ -18 అక్షరం న్యూస్:** జిల్లాలోని సంగీత సినిమా థియేటర్ లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించడం జరిగిందని పెద్దపల్లి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ డి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం అగ్నిమాపక శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు పెద్దపల్లి పట్టణంలోని సంగీత సినిమా థియేటర్ నందు తనిఖీ నిర్వహించి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సినిమా థియేటర్ లో అగ్ని ప్రమాదాల నివారణ చర్యల గురించి వివరించడం జరిగిందని, థియేటర్ లో ఉన్న అగ్నిమాపక సాధనాలను పరీక్షించి వాటి పని చేయు విధానం సిబ్బందికి తెలియజేశామని, ఎలక్ట్రికల్ ఫైర్ పై అవగాహన కల్పించామని అన్నారు. సినిమా థియేటర్ లో పొగ త్రాగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామని, ఒకవేళ అగ్ని ప్రమాదం సంభవించినచో సిబ్బంది ఎలా స్పందించాలో వివరించామని, ఇసుక బకెట్ లలో 6 నెలలకు ఒకసారి పొడి ఇసుకను మార్చాలని ఆదేశించామని, ఫైర్ హైడ్రేంట్స్ కు సరిపడు నీరు ఉండేలా చూసుకోవాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫైర్ మాన్ కె.శ్రీనివాస్, పి.నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న గడ్డం వివేక్ వెంకటస్వామి



**పెద్దపల్లి టౌన్ జూన్ 18 అక్షరం న్యూస్ :** పెద్దపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రోజున రేణుక ఎల్లమ్మ దేవి బోనాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి గీత కార్మికులు రేణుక ఎల్లమ్మ దేవి అనుగ్రహంతో సుఖశాంతులతో ఉండాలని సమస్త ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆ రేణుక మాతా దేవిని కోరుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలిండియా గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు టిపిసిసి ప్రచార కార్యదర్శి భూస్నవేని రమేష్ గౌడ్ పెద్దపల్లి గౌడ సంఘ అధ్యక్షులు కోట సమ్మయ్య గౌడ్ పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భూషణవేణి సురేష్ గౌడ్ ఉపాధ్యక్షులు రేగుంట సురేష్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ రేగుంట రమేష్ తిర్రి తిరుపతి గౌడ్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పరిష విజయ్ కుమార్ బొడ్డుపల్లి సంపత్ గీత కార్మికులు పాల్గొన్నారు.

# ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి





**- ఆశ కార్యకర్తలకు రు. 18 వేల రూపాయలు వేతనం చెల్లించాలి**
**- గుండెబోయిన నాగమణి మహిళ మోర్చ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు**

**మహబూబాబాద్ /గార్ల /జూన్ 18/అక్షరం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర బిజెపి మహిళ మోర్చ అధ్యక్షురాలు శిల్ప రెడ్డి పిలుపు మేరకు ఆశ కార్యకర్తల సమస్యలపై మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కు వినతి పత్రం సమర్పించిన మహబూబాబాద్ జిల్లా, మహిళా మోర్చ అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి. అనంతరం ఆమె మాట్లాడుతూ,ఆశ కార్యకర్తలకు నిర్వహించే పరీక్షలను వెంటనే నిలుపుదల చేయాలని, 2023 ఎలక్షన్ల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలకు నెలకు 18 వేలు, మరియు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రతి నెల 1 వ తేదిన జీతాలు ఇవ్వాలని , 22 సాధారణ సెలవులను ఇస్తు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పరిగణించాలని కోరారు.అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చంద్రకళ, గార్ల మండల అధ్యక్షురాలు ఆజ్మిర సుమలత, బయ్యారం మండల నాయకురాలు విజయ, మంగమ్మ,కుమారి ,స్వరుప తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ కారులను ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతి



**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -18(అక్షరం న్యూస్ ):** గ్రామాల్లో పట్టణాల్లో చేతివృత్తి కళాకారుల నైపుణ్యం మరువలేనిది. కానీ నేటి సమాజంలో . చేతి వృత్తి కళాకారుల కుటుంబాలను కాపాడే బాధ్యత ప్రభుత్వాలపై ఉందంటూ మంగళవారం ముస్తాబాద్ మండల కేంద్రంలో మండల స్వర్ణ కారుల సంఘము అధ్యక్షులు చింతోజు బాలయ్య ఆధ్వర్యంలో స్వర్ణకారులందరూ ర్యాలీగా బయలుదేరి స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో కార్యాలయం లో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు చింతోజు బాలయ్య మాట్లాడుతూ.... చేతివృత్తుల లో ఒకటైన స్వర్ణకారుల జీవన పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, కార్పొరేట్ జ్యువెలరీ దుకాణాలతో చేతివృత్తులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు , .స్వర్ణకారులు అకాల మరణం, ఆత్మ హత్య చేసుకొని మరణిస్తే రు 10లక్షల ఎక్స్గ్రేషియ ఇవ్వాలని, పెన్షన్ బీమా సౌకర్యాలు కల్పించాలని, జీవో ఎంఎస్ 272ను వెంటనే అమలు చేయాలని కోరారు , ప్రభుత్వం వద్ద పెండింగ్ ఉన్న 5మెన్ రిపోర్ట్ ను యధాతథంగా అమలు చేయాలని,గీత, నేత, కార్మికులకు ఇస్తున్న విధంగానే వృద్ధ స్వర్ణకారులకు రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు . స్వర్ణకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి స్వర్ణకారుల కుటుంబాలను ఆదుకోవాలని,పుస్తెలు, మెట్టెలు, నిశ్చితార్థపు ఉంగరాలు, లక్ష్మీరూపాలను స్వర్ణకారులే చేసేలా జీవో జారీ చేసి వృత్తిదారులను ఆదుకోవాలని,వినతి పత్రం ద్వారా తెలుపమన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల మండల అధ్యక్షులు చింతోజు బాలయ్య, తుమ్మనపల్లి సతీష్, చింతోజీ శ్రీనివాస నారోజు రాజు, వెంగళం శ్రీనివాస్, అనిల్, చింతోజీ సంతోష్, సత్యనారాయణ, బ్రహ్మ చారి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# గుప్తనిధుల తవ్వకాల కలకలం

**- ముల్కనూర్ శివారులో రావులమ్మ గుడి నేలమట్టం**
**- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**



**హనుమకొండ/భీమదేవరపల్లి/జూన్ 18(అక్షరం న్యూస్):**సులభంగా డబ్బు సంపాదించాలని కొందరు వ్యక్తులు అడ్డదారులు తొక్కుతున్నారు. చివరికి అవి ఫలించకపోగా చిక్కుల్లో పడుతున్నారు. ఇలాంటి ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ లో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని ముల్కనూర్ శివారులో ఓ మామిడి తోటలో గత రెండు రోజుల క్రితం గుప్తనిధుల తవ్వకాలు కలకలం రేపాయి. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన గుప్త నిధుల వేట పై మండలంలో జోరుగా చర్చ సాగుతోంది. మండలంలోని ముల్కనూర్ కు చెందిన ఓ రైతు మామిడి తోటలోని పురాతన రావులమ్మ గుడి కింద గుప్తనిధులు ఉన్నాయనే ఆశతో తవ్వకాలు జరిపారు. మండలంలోని విశ్వనాథ కాలనీ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జెసిబి సాయంతో తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. మామిడి తోటలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారని సదరు తోట యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు పొక్కిందని స్థానికుల ద్వారా తెలుస్తుంది. ముల్కనూర్ గ్రామానికి చెందిన నలుగురు అనుమానితులను పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

# మున్సిపల్‌లో ఇంటి నెంబర్లు ఇవ్వడంలో జాప్యం తగదు





**- సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నట్లు చైర్మన్ దృష్టికి.**
**-ప్రభుత్వం నిబంధన ప్రకారం మున్సిపల్ ప్రజలకు సేవలు అందించాలి.**
**- పునరావృత్తం అయితే సిబ్బందిపై కఠిన చర్యలు, మున్సిపల్ కు ఆదాయం వచ్చేలా నిబద్ధతతో పని చేయాలి.**
**- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో హెచ్చరించిన మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్**

**వికారాబాద్,జూన్ 17, అక్షరం న్యూస్:** వికారాబాద్ మున్సిపల్ పరిధిలో కొత్తగా నిర్మించే ఇండ్లకు ఇంటి నెంబర్లు ప్రభుత్వ నిబంధన ప్రకారం ఇవ్వాల్సిందేనని, అలా కాకుండా ఎవరైనా అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ హెచ్చరించారు. ఈరోజు మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు మున్సిపల్ రెవెన్యూ విభాగంతో చైర్ పర్సన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వా నిబంధనల ప్రకారం సేవలు అందించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. వికారాబాద్ పట్టణంలో కొత్తగా నిర్మించిన ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయించడంలో రెవెన్యూ సిబ్బంది అవకత అవకలకు పాల్పడుతున్నారని చైర్ పర్సన్ దృష్టికి రావడంతో ఇలాంటివి ఇకపై పునరావృతం కాకూడదని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ నిబంధన ప్రకారం మున్సిపల్ కు మరింత ఆదాయం వచ్చేలా రెవెన్యూ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఆర్వో కృపాకర్, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# దొరికిన చేరవాణిని బాధితునికి అందజేసి నిజాయితీ చాటుకున్న విలేకరి




**రామగిరి (పెద్దపల్లి జిల్లా) జూన్ 18 అక్షరం న్యూస్:** మండలంలోని సెంటినరీ కాలనీకి చెందిన రామకృష్ణ మంగళవారం మధ్యాహ్నం తెలంగాణ చౌరస్తాలో రూ 12 వేలు విలువచేసే సెల్ ఫోను పోగొట్టుకున్నాడు. ఆ సెల్ ఫోన్ రిపోర్టర్ కొండ్ర సుకుమార్ గౌడ్ కు దొరికింది .ఆ సెల్ ఫోన్ వారు ఎస్సై కాటారపు సందీప్ కుమార్ కు అప్పగించరు .ఎస్ ఐ సెల్ ఫోన్ పరిశీలించి సెంటినరీ కాలనీకి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి దని తెలుసుకొని అతని పిలిపించి ఎస్సై బాధితునికి రిపోర్టర్ సుకుమార్ గౌడ్ చేతుల మీదుగా మొబైల్ ఫోన్ అందజేశారు .కాగా నిజాయితీ చాటుకున్న సుకుమార్ గౌడ్ ను ఎస్ఐ స్థానిక రిపోర్టర్లు అభినందించారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609